

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

## కరీంనగర్
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

మంగళవారం 20 ఆగష్టు 2024 | 10 పేజీలు


# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

సూర్య కరీంనగర్ ప్రతినిధి

రాఖీ అంటే 'రక్షణ' అని అర్థం. రాఖీ పండుగనే 'రక్షా బంధన్' అని కూడా పిలుస్తారు. 'రక్ష' అంటే రక్షించడం, 'బంధన్' సూత్రం కట్టడం అని అర్థం. అన్న లేదా తమ్ముడు విజయం దిశగా అడుగే యాలని, అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకుంటూ.. సోదరి రాఖీ కడుతుంది. సోదరుడి విజయాన్ని సోదరి కాంక్షిస్తే.. ఏ కష్టమైనా నీకు అండగా నిలుస్తానని సోదరుడు హామీ ఇస్తాడు. అలాంటి రక్షాబంధన్ వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోదర సోదరీమణులు ఘనంగా జరుపుకున్నారు.



8లో..

## ఢిల్లీ పెద్దలతో కేసీఆర్
# మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారు

- మాట ముచ్చటసహా కప్పం కూడా చెల్లించినట్లున్నదు
- అందుకే అవినీతి కేసులన్నీ అటకెక్కించేశారు
- మంచి ముహూర్తం చూసుకుని బీఆర్ఎస్ ను విలీనం చేసుకోవడమే తరువాయి
- రుణమాఫీపై చిత్తశుద్ధి ఉంటే శ్వేత పత్రం విడుదల చేయండి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

సూర్య కరీంనగర్ ప్రతినిధి



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు చెల్లించాల్సిన కప్పం కట్టేసిండు. అందుకే కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ సహా కేసీఆర్ కుటుంబంపైనున్న అవినీతి కేసులన్నింటినీ అటకెక్కించారు. కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేస్తానన్న వాళ్లు ఇప్పుడు సైలెంట్ అయ్యిర్రు"అని (మిగతా 2లో)

### అన్నదమ్ములకు రాఖీలు కట్టకుండా అడ్డుకున్న
# గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్





సూర్య తంగళ్లపల్లి

బద్దెనపల్లి గ్రామంలో ని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రాఖీ పండుగ సందర్భంగా గురుకుల పాఠశాలకు బాలికల తల్లిదండ్రులు అన్నదమ్ములు వారిచే రాఖీ కట్టించుకోవడానికి పాఠశాలకు వచ్చారు. వారిని లోపటికి అనుమతించకుండా గేటు బయటనే పాఠశాల ప్రిన్సిపాల్ ఉంచినారు. ఎలాగో అలాగా గేటు నుంచి లోపలికి వెళ్లి కిటికీలోంచి వారి అన్నదమ్ములు రాఖీలు కట్టించుకున్నారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించి పాఠశాల ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.





### రాజన్న క్షేత్రంలో
# భక్తుల రద్దీ

సూర్య వేములవాడ

2లో..






# ఢిల్లీ పెద్దలతో కేసీఆర్ మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. విలీనంపై కాంగ్రెస్ తో కేసీఆర్ మాట ముచ్చట కూడా పూర్తి చేసినట్లు సమాచారముందని, ఇగ మంచి ముహూర్తం చూసుకుని విలీనం కావడమే తరువాయి అని వ్యాఖ్యానించారు.సోమవారం కరీంనగర్ లోని తన నివాసం వద్ద బండి సంజయ్ కుమార్ తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ చేస్తున్న ప్రచారానికి, వాస్తవానికి పొంతనే లేదు. సోనియాగాంధీ పుట్టిన రోజునాడు రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కొందరికే మాఫీ చేశారు. 40 వేల కోట్ల రూపాయలు మాఫీ చేస్తామని చెప్పి రూ.17 వేలు కోట్లు మాత్రమే ఖర్చు చేసి సోనియాగాంధీనే మోసం చేసిన ఘనులు. రైతు భరోసా, విద్యా భరోసా, మహాలక్ష్మీ వంటి 6 గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. ఇవన్నీ అడుగుతుంటే బీజేపీలో బీఆర్ఎస్ విలీనమంటూ డ్రామాలాడుతున్నరు. విలీనం అంశం గంగలో కలవనీయండి. వాటితో ప్రజలకు ఒరిగేదేముంది? అని అన్నారు. ఆ మాటకొస్తే కేసీఆర్ ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు కప్పం కట్టేసినట్లు సమాచారముంది. అందుకే కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ కేసులను అటకెక్కించారు. కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసి జైల్లో వేస్తామని ప్రగల్భాలు పలికినోళ్లు సైలెంట్ అయ్యారు. ప్రతిఫలంగా కాంగ్రెస్ తో బీఆర్ఎస్ విలీనంపైనా కేసీఆర్ మాట ముచ్చట కూడా పూర్తి చేసుకున్నట్లు తెలిసింది. ఇగ మంచి ముహూర్తం చూసుకుని కాంగ్రెస్ లో బీఆర్ఎస్ ను విలీనం చేయడమే తరువాయి. అవినీతి, కుటుంబ పాలన విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ జోడీ పార్టీలే. అందుకే రెండు పార్టీలు ఒక్కటైతున్నయ్ అని అన్నారు.బీఆర్ఎస్ ను విలీనం చేసుకోవాల్సిన ఖర్మ, అవసరం బీజేపీకి లేదు. ఆ పార్టీని విలీనం చేసుకుంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేది కూడా లేదు. ఆ అవసరం కాంగ్రెస్ కే ఉంది. ఎందుకంటే కాంగ్రెస్ లో అందరూ సీఎం కావాలనుకునే వాళ్లే. ఎవరు ఎప్పుడు హ్యాండిస్తారో తెల్వదు. అందుకే అధికారాన్ని పదిలం చేసుకునేందుకు ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నరు. విలీనం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. అవినీతి, కుటుంబ పాలనకు బీజేపీ దూరం. బీఆర్ఎస్ ను బీజేపీలో చేర్చుకునే ప్రసక్తే లేదు..కాంగ్రెస్ పార్టీ ప్రజల గురించి పట్టించుకోవడం మానేసింది. పాలనను గాలికొదిలేసింది. అడిగితే తప్ప స్పందించడం లేదు. కరీంనగర్ జిల్లాలో సాగునీరు వదలాలని ప్రజలు కోరుతున్నారు. సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా వెంటనే రివ్యూ పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు.

# ప్రయాణికులతో కిటకిటలాడిన బస్టాండ్

**సూర్య, హుజురాబాద్**

వరుసగా పండుగలు, సెలవులు రావడం, రాఖీ పండుగ కోసం వెళ్లే ప్రయాణికులతో ఆదివారం హుజురాబాద్ బస్టాండ్లు కిటకిటలాడింది. గత శుక్రవారం వరలక్ష్మీ వ్రతం , సోమవారం రాఖీ పండుగ కావడంతో తమ సోదరుల వద్దకు వెళ్లే మహిళా ప్రయాణికులతో బస్సులన్నీ నిండి పోయాయి. ఆదివారం హుజురాబాద్ బస్టాండ్లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులను చూస్తే జాతరను తలపించింది. ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండడం బస్సుల సంఖ్య తక్కువగా ఉండడంతో వారిని అదుపు చేయడం కోసం హుజురాబాద్ డిఎం రవీంద్రనాథ్ ఆర్టీసి ఉద్యోగుల సహాయంతో ప్రయాణికులను బస్సులలలో సక్రమంగా ప్రయాణించే విధంగా చూశారు. ప్రయాణికులు లేని రూటు బస్సులను ఎక్కువగా ప్రయాణికులు ఉన్న రూట్ లకు మార్చి బస్సులను పంపించారు. ఒక్కొక్క బస్సులో 120 నుండి 150 మంది కన్నా ఎక్కువ మంది ప్రయాణించారు. ఎన్ని బస్సులు వచ్చినప్పటికీ అన్ని బస్సులలో నిలుచడానికి కూడా స్థానం లేని పరిస్థితి కనబడింది. గత రెండు రోజులుగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు కెపాసిటీ కన్నా ఎక్కువగా ప్రయాణిస్తూనే ఉన్నారు. మరో రెండు రోజుల వరకు తిరిగి తమ స్వస్థలాలకు వెళ్లే వరకు బస్సుల్లో రద్దీ బాగా ఉంటుందని ఆర్టీసీ అధికారులు తెలుపుతున్నారు. ఏది ఏమైనా ఉచిత బస్సు అనడంతో ఎక్కువగా ప్రయాణికులు వస్తున్నారని మహిళలే వ్యాఖ్యానించడం కొసమెరుపు.

# అసత్య ప్రచారాలతో రైతులను ఆగం చేస్తున్న ప్రతిపక్షాలు

**- మానకొండూరు శాసన సభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ**

**సూర్య, తిమ్మాపూర్ 04**



రుణమాఫీ పై ప్రతిపక్షాలు అసత్యాలను ప్రచారం చేస్తూ రైతులను ఆగం చేస్తున్నారని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మానకొండూర్ శాసన సభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోపించారు. రైతు ఋణ మాఫీ ఏది అని తొడలు కొట్టి దమ్ము, ధైర్యం గురించి మాట్లాడిన బీఆర్ఎస్ఎస్ నేతలు ఇప్పుడు రాజీనామాలంటూ కొత్త రాగం అందుకున్నారని ఆయన విమర్శించారు. మూడు విడతల్లో రేవంత్ సర్కార్ రుణ మాఫీ అమలు చేయడంతో దిక్కుతోచని బీఆర్ఎస్ నాయకులు సాంకేతిక కారణాలతో రుణ మాఫీ పొందలేకయిన రైతులను రోడ్ల మీదికి ఎగదోస్తున్నారని ఆయన విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రుణ మాఫీ కోసం పొలాల్లో ఉన్న రైతులు రోడ్ల మీదికి వచ్చి ఆందోళనలు చేసిన విషయాన్ని గులాబీ నేతలు మర్చిపోవడం విస్మయం కలిగిస్తున్నద న్నారు. అయితే అదేమీ విచిత్రమో గాని రుణ మాఫీ చేసినా కూడా బీఆరెస్ నాయకులు రైతులను రోడ్ల మీదకి రప్పించి ధర్నాలు చేయిస్తున్నారని, ఈ పాపం ఊరికే పోదని ఆయన విమర్శించారు. రైతులు వాస్తవాలను గ్రహించాలని, ప్రతిపక్షాల మోసపూరిత మాటలు నమ్మి ఆగం కావద్దని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కోరారు.రైతు రుణమాఫీ విషయంలో ఎలాంటి గందరగోళానికి తావు లేదని, అర్హులైన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. రూ.2 లక్షల లోపు రుణాల వరకు అర్హులైన రైతులకు సంబంధించిన రుణాలను ఆగస్టు 15వ తేదీన మాఫీ చేసిందని, రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు జమ చేయడం వల్ల దాదాపు 22 లక్షల మంది రైతులు లబ్ది పొందారని ఆయన వివరించారు.దీనికి ముందు జులై 18న రూ.లక్ష లోపు రుణాలు, అదే నెల 30న రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర లోపు రుణాలు మాఫీ చేసిందని ఆయన గుర్తు చేశారు. రైతు రుణ మాఫీ పై రూ.31 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం రూ.18 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ కోసం వెచ్చించినట్లుగా ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. రైతులు ఈ ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. రుణమాఫీ ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని, ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన విధి విధానాల ప్రకారం చివరి విడతలోరూ.2 లక్షలకు మించి రుణాలున్న రైతులకు రుణమాఫీ వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు.బ్యాంకు ఖాతాలు, ఆధార్ నెంబర్లు, పాసు పుస్తకాలు సరిగా ఉన్న రైతులందరికీ రుణమాఫీ జరిగిందని, ఇందులో సందేహాలకు తావులేదని ఆయన విస్పష్టం చేశారు. బ్యాంకు ఖాతాలు సరిగా లేనివి, కుటుంబ నిర్ధారణ జరగని ఖాతాలు, ఆధార్ నెంబర్లలో తప్పులున్నవి, పాస్ బుక్ నెంబర్లు లేనివి, బ్యాంకు ఖాతాల్లో ఉన్న పేర్లతో ఆధార్లో ఉన్న పేర్లతో సరిపోని ఖాతాలు మాత్రమే పెండింగ్ లో ఉన్నాయని,వీటన్నింటినీ సరి చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించి దన్నారు. స్థానిక ఖాతాల్లో డబ్బు జమ కాని రైతులు సంబంధిత మండల వ్యవసాయ అధికారిని కలిసి తప్పిదాలను సరి చేసుకుంటే ఆయా రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులను ప్రభుత్వం జమ చేస్తుందని ఎమ్మెల్యే వివరించారు. బ్యాంకులో సాంకేతిక పరమైన కారణాలతో కొంతమంది ఖాతాల్లో వేసిన డబ్బులు కూడా వెనక్కి వచ్చాయ న్నారు. వీటిలో ఉన్న చిన్న చిన్న తప్పులను గుర్తించి రాష్ట్ర వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు సరి చేస్తున్న దని, ఇప్పటికే 8 వేల ఖాతాలకు తిరిగి డబ్బులు జమ చేసిందని ఆయన చెప్పారు. రూ.2 లక్షల లోపు రుణమున్నప్పటికీ, మాఫీ కాని రైతులెవరైనా ఉంటే ఆ బ్యాంకు బ్రాంచీ ఉన్న మండలం వ్యవసాయ అధికారిని కలిసి ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. అలాగే ఆధార్ సరిగ్గా లేకుంటే వెంటనే ఆ రైతు తన సరైన ఆధారాలతో పాటు, ఓటర్ ఐడీ లేదా వెహికల్ లైసెన్స్ లేదా రేషన్ కార్డును ఎంఈవోకు అందించాలని ఆయన సూచించారు. కుటుంబ నిర్ధారణ జరగలేదనే కారణంతో రుణమాఫీ అమలు కాలేదన్న ఫిర్యాదులపై సంబంధిత అధికారి క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేస్తారని, రైతుల ఇంటికి వెళ్లి ఆ కుటుంబంలో రైతు ఖాతాలున్న వారి ఆధార్ కార్డులు, రైతు వెల్లడించిన వివరాలను నమోదు చేసుకొని పోర్టల్లో అప్లోడ్ చేస్తారని, ఆధార్ లో, బ్యాంకు ఖాతాలో ఉన్న రైతు పేరు సరిపోలకపోతే, రైతులు సరైన పేరున్న అప్? డేటెడ్? ఆధార్ కార్డును సమర్పించాల్సి ఉంటుందన్నారు. నెల రోజుల్లో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులన్నింటినీ వ్యవసాయ శాఖ పరిష్కరిస్తుందని ఆయన తెలిపారు.



## రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

**సూర్య, వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసం సందర్భంగా వేకువ జాము నుండే భక్తులు ఆలయానికి చేరుకొని స్వామి వారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. రాజన్నకు ఎంతో ప్రీతికరమైన కోడె మొక్కులు, తమ మొక్కుబడి కింద తల నీలాలు సమర్పించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

## నంది అవార్డు గ్రహీత దుస వీరేశంను సన్మానించిన బండి సంజయ్

**సూర్య, కరీంనగర్ ప్రతినిధి**



జాతీయ పురస్కార నంది అవార్డు గ్రహీత ఫిజికల్ డైరెక్టర్ దుస వీరేశం ను సోమవారం రోజున కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించి సన్మానించారు. మాజీ ప్రధాని పి వి నరసింహారావు జయంతి ఉత్సవాల సందర్భంగా 2024 సంవత్సరానికి తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణించిన ఐదు రాష్ట్రాలకు చెందిన వారిని ఎంపిక చేశారు. ఇందులో తెలంగాణ రాష్ట్రం నుండి క్రీడా రంగంలో ఫిజికల్ డైరెక్టర్ దుస వీరేశంను జాతీయ పురస్కారం నంది అవార్డ్ కోసం ఎంపికయ్యారు . దూస వీరేశం కరీంనగర్ పట్టణం 58వ డివిజన్ కు చెందిన నివాసి కావడంతో స్థానిక డివిజన్ బిజెపి నేత రాపర్తి ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం రోజున కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అవార్డు పొందిన దూస వీరేశమును అభినందించి సన్మానించారు.

## 21న భారత్ బంద్ విజయవంతం చేయండి

**సూర్య, చొప్పదండి**



ఎస్సి వర్గీకరణ పై సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ అగస్టు 21 న జరిగే భారత్ బంద్ ను చొప్పదండి మండల కేంద్రంలో అందరూబందు పాటించాలని వర్గీకరణ వ్యతిరేఖ పోరాట సమితి మండల బాధ్యుడు, మండల మాలమ హానాడు అధ్యక్షుడు%ఎ%కుననమల్ల చంద్రయ్య ప్రజలకు విజ్ఞతి చేశారు. ఈ సందర్భంగా కోర్టు తీర్పు పై మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ఎస్సి ఉప వర్గీకరణ చేసుకునే వెసులుబాటును రాష్ట్రాలకు కల్పిస్తూ, అగస్టు 1 న దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 7 గురి దర్మాసనం,6:1, ఇచ్చిన తీర్పును నిరసించారు.కోర్టు నిర్ణయాల్లో రాజకీయ జోక్యంను, వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న దళిత సంఘాల భారత్ బంద్ పిలుపు మేరకు అగస్టు 21 జరిగే బంద్ కు చొప్పదండి పట్టణ కేంద్రం లో ని వ్యాపారం,వాణిజ్య రంగాలు,విద్యాసంస్థలు, ప్రైవేటు , ఆర్టీసి యాజమాన్యలు సహకరించాలని కోరారు. రాజ్యాంగ సవరణ జరగకుండా వర్గీకరణ ఎలా సాధ్యం అని ప్రశ్నించారు.దళితుల్ని రాజ్యాధికారం నుండి దూరం చేసే ఈ కుట్రలను తిప్పికొట్టాలని అంబేద్కర్ వాదులను కోరారు. మండలం లోని అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా బందు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి యశోద రాజయ్య, ఉపాధ్యక్షులు, పురుషోత్తం కనకయ్య,కల్లెం రాజు, శ్రీనివాస్, యూత్ చింతల వినయ్, కాయిత, మొగురం అజయ్,అనంతుల శేఖర్, కునమల్ల దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## 21న ఆర్నకొండలో విద్యుత్ వినియోగదారుల సదస్సు

**సూర్య, చొప్పదండి**

విద్యుత్ వినియోగదారుల సదస్సు సిజిఆర్ఎఫ్ -1లోకల్ కోర్ట్ ఆగష్టు 21 బుధవారం ఉదయం గం.10.30 ని. నుండి మధ్యాహ్నం గం.1.00 వరకు 33/11%ఖు% సబ్ స్టేషన్, ఆర్నకొండ కార్యాలయంలో నిర్వహించబడునని టీజీఎన్పిడిసిఎల్ డి ఈ(ఆపరేషన్ ) ఈ. సత్యనారాయణ తెలిపారు.విద్యుత్ వినియోగదారుల సమస్యలు, విద్యుత్ పునరుద్ధరణ, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం,నూతన సర్వీసులు మంజూరు,అదనపు లోడ్ క్రమబద్దీకరణ,బిల్లులు వాడకానికన్నా ఎక్కువ, సర్వీసులు రద్దు, కేటగిరి మార్పు తదితర వాటికి సంబంధించిన ఫిర్యాదులు ఆర్నకొండ, చొప్పదండి, గుండి, అచంపల్లి, గంగాధర సెక్షనుల పరిధిలో గల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఈ కోరారు.

# ప్రజావాణిలో వచ్చే ధరఖాస్తులకు పరిష్కార మార్గం చూపాలి

## -జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**సూర్య జగిత్యాల**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 9 ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ పి. రాంబాబు తో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల



పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, ఆర్డిఒలు, మధు సుధన్, ఆనంద్ కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంతరావు, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## శివాజీ మహరాజ్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఎన్నిక

**సూర్య ఎండపల్లి**



మండలంలోని గుల్లకోట గ్రామంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ప్రతిష్టాపన కొరకు ఈ సోమవారం రోజున కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షులు మడ్డి మహేష్ గౌడ్,గౌరవ అధ్యక్షులు గా,గొల్లపల్లి సత్యం,పొన్నం నరేష్,పొన్నం కిరణ్ మెరుగు తిరుపతి,గుండ తిరుపతి,గోనే వెంకటేష్,బుర్ర సాయి,బేత్తపు జనార్దన్.ఉపాధ్యక్షులు గా జక్కుల స్వామి,వనం భీమరాజు,బాస శ్రీకాంత్, బైరి రాజేశంప్రధాన కార్యదర్శులుగా దావుల జీవన్,గొల్ల నాగరాజు కోశాధికారులుగా పొన్నం మహేష్మూల ప్రశాంత్ప్రచారకర్తలుగా బాయిగారి సాయికిరణ్, గొల్లపల్లి రామ్ చరణ్, సలహాదారులుగా గోనే సురేష్ గౌడ్, అమరగొండ నగేష్,సభ్యులుగా కమిటీ ఎన్నిక కావడం జరిగింది, ఈ సందర్భంగా అధ్యక్షులు మడ్డి మహేష్ మాట్లాడుతూ శివాజీ మహరాజ్ విగ్రహ ప్రతిష్టాపన కొరకు అందరూ ఏక తాటిపై ఉండి,గ్రామంలో విగ్రహ ఏర్పాటు కొరకు కృషి చేస్తాం అని,ప్రజల కోసమే ప్రభువు అని సూత్రం అని పాటించిన బహుజన వీరుడు చత్ర పతి శివాజీ అని కొనియాడారువిగ్రహ దాతలుగా తాజా మాజీసర్పంచ్ పొన్నం స్వరూప తిరుపతి ముందుకు రావడం సంతోషకరం అన్నారు, ఈకార్యక్రమంలో గ్రామ యువత పాల్గొన్నారు

## ఘనంగా జంద్యాల పౌర్ణమి వేడుకలు

**సూర్య బీర్పూర్**



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం తుంగూరు గ్రామంలో జంద్యాల (నూలు) పౌర్ణమి సందర్బంగా సోమ వారం పద్మశాలి సంఘ భవనంలో జంద్యాల పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా మర్కండేయ స్వామికి, శివుడికి పూజలు చేసి సభ్యులు నూతన యజ్ఞోపవీతము దరించారు.అనంతరం సభ్యులు మాట్లాడుతూ శ్రావణ పూర్ణిమను జంధ్యాల(నూలు) పూర్ణిమ అని కూడా అంటారని తెలిపారు. ఈ రోజున నూతన యజ్ఞోపవీత ధారణ చేసి , జప , అర్చనాదులను నిర్వహిస్తుంటారన్నారు. యజ్ఞోపవీతము అనే పదము 'యజ్ఞము' 'ఉపవీతము' అనే రెండు పదాల కలయికవల్ల ఏర్పడిందని యజ్ఞము అంటే 'యాగము' 'ఉపవీతము' అంటే దారము అనే అర్థాలున్నాయన్నారు. ఈ జంధ్యాల పూర్ణిమ కేవలం ఉపనయన సంస్కారం ఉన్న వారికే పరిమితమైనప్పటికీ మిగతా వారు కూడా ఈ రోజు అష్టోత్తరాలతో యాధాశక్తి గాయత్రీ దేవిని పూజిస్తే సకల శుభాలు జరుగుతాయని అన్నారు.ఈ కార్యక్రమం లో పద్మశాలి సేవా సంఘం సభ్యులు, పద్మశాలి యువత పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి మినిస్టర్‌ను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే

**సూర్య జగిత్యాల**



రాష్ట్ర రోడ్డు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డిని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సోమవారం హైదరాబాద్ లోని మంత్రి కార్యాలయం లో కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జగిత్యాల నియోజకవర్గం లో పాడైన, నూతన రోడ్లు,వంతెనలకు నిదులు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

## బిజెపి కార్యాలయంలో రక్షా బంధన్ వేడుకలు

**సూర్య జగిత్యాల**



రాఖీ పౌర్ణమి సందర్భంగా భారతీయ జనతా పార్టీ జగిత్యాల నియోజకవర్గ కార్యాలయం కమల నిలయంలో సోమవారం భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి పార్టీ కార్యకర్తలకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సనాతన ధర్మ విశిష్టతను రక్షాబంధన్ ఒక ప్రాముఖ్యతను స్నేహపూర్వకమైన బంధాన్ని తెలియజేస్తుందన్నారు. మాతృమూర్తుల బంధాన్ని అన్నదమ్ముల బంధాన్ని సమాజసేవ బంధాన్ని మన దేశం సరిహద్దులలో అహర్నిశలు భద్రతతో కాపాడే జవాన్ల బంధాన్ని భిన్నత్వంలో ఏకత్వం అంటే నేను నీకు రక్ష నీవు నాకు రక్ష మనమిద్దరం దేశానికి ధర్మానికి రక్షా అని తెలియజేసే గొప్ప పండుగ రాఖీ పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, సిరికొండ రాజన్న, రూరల్ మండల అధ్యక్షులు నలువాల తిరుపతి, అర్బన్ మండల అధ్యక్షులు రామ్ రెడ్డి, తుమ్మల గంగారం, గాదాసు రాజేందర్, బోగ రాజ్ కుమార్,గంగరాజం, మ్యాకల లక్ష్మి, సింగం పద్మ, గడ్డల లక్ష్మి, మధురిమ, భానుప్రియ, కవిత, సోమలక్ష్మి, లావణ్య, మంజు భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**సూర్య మెట్‌పల్లి**



అన్న చెల్లి,అక్క తమ్ముడు ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) పండగను డివిజన్ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రాఖీ లు కట్టుకొని నీకు అండగా ఉంటాం అని ఆడబిడ్డలకు అభయం ఇచ్చారు.

**ఎమ్మెల్యే కు రాఖీ కట్టిన సోదరి..**

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఇంటిలో రక్షాబందన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సోదరి సమత రాఖీ కట్టారు. ఎమ్మెల్యే తన సోదరికి, నియోజకవర్గ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

**పద్మశాలి సంఘం ఆద్వర్యంలో..**

పట్టణ పద్మశాలి సంఘం ఆద్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మార్కండేయ దేవాలయం నుండి ఓంకారేశ్వర దేవాలయం వరకు మార్కండేయ స్వామి పల్లకి ఉత్సవం నిర్వహించారు. అనంతరం దేవాలయాల్లో రాఖీ లు కట్టుకొని జంజీరాలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ అధ్యక్షుడు ద్యావనపల్లి రాజారాం, ప్రధాన కార్యదర్శి భీమనాతి సత్యనారాయణ, క్యాషియర్ బేతు భాస్కర్, ఉపాధ్యక్షులు శంకు ఆనందు, సాంబారి ప్రభాకర్,ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, గుంటుక గౌతమ్, వడ్డేపల్లి చిన్నయ్య, కట్టెకోల శివరాజం, భూపతి,ఆడేపు శివాజీ, చిలివేరి శ్రీనివాస్, గణేష్, దుర్గ, చిలివేరి ప్రసాద్,సతీష్, అడ్లగట్ల నరసయ్య, పట్టణ 24 వార్డుల సంఘల అధ్యక్ష కార్యవర్గం పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

### జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**సూర్య జగిత్యాల**



సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఓ.పి. సేవలు, ల్యాబ్ రికార్డ్స్, మెడికల్ ఫార్మాసిని పరిశీలించారు. ఆసుపత్రిలో స్టాక్ పొజిషన్, సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, ప్రసూతి సేవల పేషేంట్లకు ఇబ్బంది కలుగకుండా వైద్య సేవలు కల్పించాలని సూచించారు. డెంగ్యూతో ఎక్కువగా ఎవరు రాలేదని, సాధారణ జ్వరాలతో అడ్మిట్ అవ్వడం జరిగిందని, వారితో శుభ్రమైన త్రాగునీరు, భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసు కున్నారు. అదే విధంగా పేషేంట్ల వివరాలను, వారి ఆరోగ్య పరిస్థితిని గురిం చి కలెక్టర్ వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో అందరూ వైద్యులు, సిబ్బంది ఉన్నారా లేదా అని అటెండెన్స్ రిజిస్టర్ పరిశీ లించారు. అందుబాటులో లేని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ల్యాబ్‌ని పరిశీలించి రక్త పరీక్షలు సరిగ్గా నిర్వహిస్తున్నారా లేదా అని ల్యాబ్ రికార్డ్స్‌ని కలెక్టర్ చెక్ చేశారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి యండి. సమీయొద్దీన్, ఆర్.ఎం.ఓ, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న ఇళ్ల ను కాళీ చేయాలి

**సూర్య -కోరుట్ల**



కోరుట్లపట్టణంలో కురుస్తున్న భారీ వర్షాలకుశిథిలావస్థలో ఉన్నఇళ్లలో నివాసము ఉండకుండా వాటిని వెంటనే ఖాళీ చేసి సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లాలని కోరుట్ల మున్సిపల్ కౌన్సిలర్ పెండెం గణేష్ సూచించారు. సోమవారం పట్టణంలో భారీగా కురిసిన వర్షానికి తన వార్డులో తిరుగుతూ శిథిలావస్థలో ఉన్న ఇండ్లను పరిశీలించి వాటిలో నివాసం ఉంటున్న ప్రజలను వెంటనే ఖాళీ చేయాలని వారిని కోరారు. వాటిలో నివాసం ఉంటే ఆస్తి నష్టం తో పాటు ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఆ ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని వెంటనే కాళీ చేసి వెళ్లాలని వారిని కోరారు.

## పలువురు మంత్రులను కలిసిన ప్రభుత్వ విప్ అడ్లూరి

**సూర్య ధర్మపురి**



ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం హైదరాబాదులో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి దీపదాస్ మున్షీ, సీతక్క, పలువురు మంత్రులను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాఖి పౌర్ణమిని పురస్కరించుకొని రాష్ట్ర మంత్రి సీతక్క లక్ష్మణ్ కుమార్ చేతికి రాఖి కట్టి శు భాకాంక్షలు తెలియజేశారు.

## వర్షపు నీరు వెళ్లేందుకు పైపుల ఏర్పాటు

**సూర్య మెట్‌పల్లి**



పాత బస్టాండ్ వద్ద నూతన మురుగు కాలువ నిర్మాణంలో ఉన్నందున వర్షం కారణంగా నీరు నిలుస్తున్నందున ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా తాత్కాలికంగా పైపులు ఏర్పాటు చేస్తుండగా మున్సిపల్ కమిషనర్ మోహన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ముజీబ్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మారు విష్ణు వర్ధన్ రెడ్డి, నిజాం, అశోక్ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నరసింహుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి శరత్ పూజలు

**సూర్య ధర్మపురి**

ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామినీ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కె. శరత్ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం సాంప్రదాయ ప్రకారం మేళతాళాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదపండితులు, అర్చకులు ఆశీర్వచనం ఇచ్చిన తదుపరి దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, స్వామివారి ప్రసాదం, చిత్రపటం ఇచ్చి శేష వస్త్రంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, ముఖ్య అర్చకులు రమణయ్య, అర్చకులు నంభి నరసింహ మూర్తి, ధర్మపురి కోర్ట్ మెజిస్ట్రేట్ శ్యాంప్రసాద్, వెల్గటూర్ ఎస్సై ఉమాసాగర్



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

పెద్దపల్లి

మంగళవారం 20 ఆగష్టు 2024




## బదిలీ పై వెళ్ళుతున్న అధికారులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థ ఆర్జీ-2 డివిజన్‌లో పనిచేసి బదిలీపై వెళ్ళుతున్న అధికారులకు 8వ కాలనీ లోని జిఎం కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్ నందు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఓసిపి3 ఎస్ఓఎం (మేనేజర్)గా విధులు నిర్వహించి ఆర్జీ-1 ఏరియా జీడికే-1 ఇంక్లైన్ కు బదిలీపై వెళుతున్న డి.రమేష్ ని మరియు ఓసిపి-3 స్టోర్స్ డీజీఎం గా విధులు నిర్వహించి ప్రాజెక్ట్ ఇంజనీర్ గా పదోన్నతిపై ఐకె ఓసీ, శ్రీరాంపూర్ ఏరియా కు బదిలీపై వెళ్ళుతున్న కెవి. రామకృష్ణ రావు ని ఏరియా జనరల్ మేనేజర్ ఎల్.వి.సూర్య నారాయణ మరియు ఏరియాలోని అన్ని విభాగాల ముఖ్య అధికారులు శాలువాలతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. బదిలీ అనేది ఉద్యోగి జీవితంలో సాధారణమైన విషయమని, ఆర్జీ-2 ఏరియాలో వీరు ఎంతో సమర్థవంతంగా పని చేశారని బదిలీపై వెళ్లిన చోట కూడా ఇదే విధమైన పని విధానాన్ని అవలబించి మంచి పేరు తెచ్చుకోవాలని జనరల్ మేనేజర్ ఎల్.వి.సూర్యానారాయణ అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న అధికారులు వారితో ఉన్న అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం ఎన్.వెంకటేశ్వర్ రావు, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, ఏరియా రక్షణ అధికారి సంతోష్ కుమార్, డిజిఎం (పర్సనల్ & అధికార ప్రతినిధి) జి.రాజేంద్రప్రసాద్, వర్క్ షాప్ డిజిఎం ఎర్రన్న, ఫైనాన్స్ డిజిఎం వెంకట రామచంద్ర, ఓసీపీ-3 మేనేజర్ భరత్ కుమార్, ఉంటి డిజిఎం ఎస్డీఏం హుస్సేన్, పర్యావరణ అధికారి సురేష్ బాబు, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, క్వాలిటీ మేనేజర్ సుభాష్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి సునీత, డివైఎస్ఇ రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో గదుల నిర్మాణానికి భూమి పూజ

**సూర్య జూలపల్లి**



మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గదుల నిర్మాణం, రేకుల షెడ్డు నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు.కొలిచిన భక్తుల కొంగుబంగారంగా వరాలు అందిస్తున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యం కొర కు ఆలయ కమిటీ సభ్యులు దాతలను కోరగా రేకుల షెడ్డు నిర్మాణానికి సింగిల్ విండో చైర్మన్ కొంజర్ల వెంకటయ్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తామని,స్లాబ్ తో కూడిన రెండు గదులు నిర్మాణానికి నల్ల మనోహర్ రెడ్డి తన సొంత ఖర్చులతో నిర్మించడానికి ముందుకు వచ్చారు.మాజీ ఎంపీపీ రమాదేవి రాంగోపాల్ రెడ్డి దంపతులతో వాస్తు పండితులు కొండపాక శ్రీనివాసచార్యులు రాఖీ పౌర్ణమి,శ్రావణ సోమవారం రెండు కలిసి వచ్చిన అద్భుతమైన ముహూర్తన భూమి పూజ క్రతువును వేదమంత్రోచ్ఛరణల మధ్య పూర్తి చేశారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్మాణాలకు ముందుకు వచ్చిన కొంజర్ల వెంకటయ్య, నల్ల మనోహర్ రెడ్డిలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పుల్లూరు వేణుగోపాల్ రావు,మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్,ఆలయ కమిటీ చైర్మన్ పోట్టాల మల్లేశం, విశ్రాంత ఉపాధ్యాయులు లోక లింగారెడ్డి, ఆలయ పూజారి ఉద్దండ నవీన్ కుమార్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారకుల అనిల్, మాజీ వైస్ చైర్మన్ లోక రవీందర్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ కొప్పుల మహేష్,మాజీ ఎంపిటిసి దండే వెంకటేశ్వర్లు,ఆలయ కమిటీ సభ్యులు బెజ్జంకి రమేష్,లెక్కల వజ్రారెడ్డి, వెంకటరమణ, బండి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**సూర్య - సుల్తానాబాద్**



అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, సోదరభావానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను సోమవారం మండలంలోని ఆడపడుచులు సంబరాలతో ఘనంగా జరుపుకున్నారు. శ్రావణ పౌర్ణమి రోజున అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు, ఆత్మీయుల అనుబంధాలకు, ఐకమత్యానికి చిహ్నంగా రక్షాబంధన్ నిలుస్తోంది. ఉదయం నుండి అడపడచులు, మహిళలు తమ పుట్టింటికి బయలుదేరి సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి ఆప్యాయతను చాటుకున్నారు. చిన్నారులు తమ సోదరులకు రాఖీలు కట్టి అలరించారు. నువ్వు నాకు రక్ష - నేను రక్ష మనిద్దరం దేశానికి, ధర్మానికి రక్ష అంటూ సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ పవిత్రతను చాటిచెప్పారు. సరికొత్త డిజైన్ లతో రంగు రంగుల రాఖీలు కొనేందుకు వచ్చిన మహిళలతో సుల్తానాబాద్ మార్కెట్ కిక్కిరిసిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడంతో మహిళలతో ఆర్టీసి బస్సులు కిక్కిరిసిపోయాయి.

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫర్లకు సన్మానం

**సూర్య పెద్దపల్లి టౌన్**




ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి రంగనాయక ఆధ్వర్యంలో సీనియర్ ఫోటోగ్రాఫర్ లు పెద్దపల్లి లక్ష్మణ్ లక్ష్మీ గణపతి ఫోటో స్టూడియో, దాసరి తిరుపతి మేఘన ఫోటో స్టూడియో లను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లు తీసే ప్రతి ఫోటో గత చరిత్రను నిలుపుతుందని, మానవియ సంబంధాలను పెంచుతుందని, కొన్ని తరాలకు మధురస్మృతులను అందిస్తుందని అన్నారు. ఆర్థికంగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ ఉత్సాహంతో ఫోటోగ్రఫీ రంగంలో రాణిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఫోటోగ్రఫీ దినోత్సవం రోజున సన్మాన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ కొమ్ము కరుణాకర్, సెక్రెటరీ హనుమండ్ల శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్నాచెల్లల్లా అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

**సూర్య-పెద్దపల్లి రూరల్**

అన్నాచెల్లల్లా అనుబంధానికి ప్రతీక గా రాఖీ పండుగ జరుపుకుంటారు. గ్రామాల్లో సోమవారం రాఖీ పండుగ సందర్భంగా అన్న చెల్లలు, అక్క తమ్ముళ్ల కు రాఖీలు కట్టారు. గ్రామాల్లో ప్రతి ఇంట్లో అక్క చెల్లెల రాకతో పండుగ వాతావరణం నెలకొంది. అలాగే ప్రతి ఒక్కరు ఆడబిడ్డల దీవెనలు ఉండాలని ఆకాంక్షించారు. సోదరికి అన్నదమ్ములు కానుకలు అందించారు.

## ఆప్యాయత అనురాగాల మధ్య రక్షాబంధన్ వేడుకలు

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



అన్నా చెల్లి అక్క తమ్ముళ్ల ఆప్యాయత అనురాగాల మధ్య రక్షాబంధన్ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా నిర్వహించుకునే రాఖీ పండుగ వేడుకలు మండలంలో అంబరాన్నంటాయి. తమ సోదరీమణులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ నీవు నాకు రక్ష నేను నీకు రక్ష అంటూ మనస్ఫూర్తిగా కోరుతూ సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వదించి, సోదరుల ఆతిథ్యాన్ని కట్న కార్మికులను స్వీకరించారు. కాలము మారిన దూరము పెరిగిన అదే అనుబంధ రాగాలతో ఆనందోత్సవాల మధ్య రాఖీ వేడుకలు జరుపుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన సోదరీమణులు తమ అన్న తమ్ముళ్ల ఇంటికి చేరుకొని రాఖీలు కట్టి ప్రేమానురాగాలను పంచారు. ఉదయము ఆలయాల్లో భక్తులు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆలయాలలో పవిత్రారోపణ చేశారు. అదేవిధంగా నవసూత్ర యజ్ఞోపవీతాన్ని ఆలయాలలో దేవతామూర్తులకు ధరింపజేశారు. ఈ శ్రావణ పౌర్ణమిని జంధ్యం పౌర్ణమి అని కూడా పిలుస్తారు. సోమవారం పలువురు నూతన జంధ్యంలను ధరించి గాయత్రి మంత్రాన్ని పటించారు. ఆలయాల్లో పురోహితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## ఘనంగా అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వ శ్రీరాంపూర్ మండల మండల కేంద్రంలో సోమవారం ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ 185 వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటో పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి తదనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాల్వ శ్రీరాంపూర్ మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరి అచ్యుత్ కుమార్, ప్రధాన కార్యదర్శి తాత రాజు యాదవ్, కోశాధికారి దోమకొండ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి మంద తిరుపతి,తోపాటు నగేష్, సందీప్, ప్రేమ్‌కుమార్, సతీష్,శంకర్ పాల్గొన్నారు.

## కార్మిక నేతలకు రాఖీలు కట్టిన మహిళా ఉద్యోగులు

**సూర్య, సెంటినరీ కాలనీ**



ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-1 సీ.హెచ్.పీ లో సోమవారం రాఖీపౌర్ణమి సందర్భంగా మహిళా ఉద్యోగులు కార్మిక నేతలకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. గుర్తింపు సంఘం ఏఐటియుసి డిప్యూటీ జనరల్‌సెక్రటరీ వై.వి.రావుకు ఇతర నేతలకు మహిళలు జ్యోతి ర్మయి,అమల, మంగ, పద్మేశ్వరి, స్రవంతి,పద్మలు రాఖీలు కట్టారు.ఈ కార్యక్రూనికి డివిజన్ అసిస్టెంట్ సెక్రటరీడీ.టీ.రావు సి.హెచ్.పీ ఫిట్ సెక్రటరీ కె.రాజయ్య అసిస్టెంట్ సెక్రటరీ గంధం శ్రీనివాస్,సిహెచ్‌పిఫిట్‌కమిటీనాయకులు, కార్మికులు హాజరయ్యారు.

## విద్యుత్ సిబ్బంది లేని కలవచర్ల

**-ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు**

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం కలవచర్ల గ్రామంలో విద్యుత్ సిబ్బంది లేక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో 33/11 కె.వి సబ్ స్టేషన్ ఉంది. కలవచర్ల, లొంకకేసారం, మారుతీ నగర్ తో పాటు రైస్ మిల్లులు, ఇతర ఇండస్ట్రీస్ ఉన్నాయి. సుమారు 6 వేల విద్యుత్ కనెక్షన్లు ఇక్కడ ఉన్నాయి. కాగా ఇక్కడ విద్యుత్ పనులు పర్యవేక్షించే లైన్ మెన్ కిరణ్ గత సంవత్సరం బదిలీపై వెళ్లారు. ఇటీవల అస్సిటెంట్ లైన్ మెన్(ఏ. ఎల్.ఎం) రవికి పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. జూనియర్ లైన్ మెన్(జే. ఎల్.ఎం) పోస్ట్ గత కొన్ని రోజులుగా ఖాళీగా ఉంది. కీలక మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.దీంతో ప్రతి రోజు విద్యుత్ సమస్యలు వస్తే తీర్చే నాధుడే కరువయ్యారు. వెంటనే అధికారులు స్పందించి ఇక్కడ సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాఖీ వేడుకలు

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా వేడుకలు జరిగాయి. అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, పెద్దపల్లి అంగన్వాడి కేంద్రం చిన్నారులు అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ కు రాఖీ కట్టి దీవెనలు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, అంగన్వాడి చిన్నారులు, టీచర్ లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఉత్తమ ఫోటోగ్రాఫర్ అవార్డులు అందుకున్న మహిమల కేదార్ రెడ్డి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

185వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ పోటీలలో రైతు భరోసా విభాగంలో కరీంనగర్ కు చెందిన సిగ్మా ఫోటో స్టూడియో యాజమాని మహిమల కేదార్ రెడ్డికి గృహలక్ష్మి విభాగము, మహాలక్ష్మి పథకం విభాగాల్లో రాష్ట్రస్థాయిలో మూడు కన్సోలేషన్ అవార్డులు హైదరాబాద్ లో గ్రీన్ పార్క్ హోటల్ లో ప్రధానోత్సవ కార్యక్రమంలో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమాచార శాఖ కమిషనర్ హనుమంతరావు ప్రెస్ క్లబ్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగాఅవార్డులను అందుకున్నారు. జాతీయస్థాయిలో మూడు గోల్డ్ మెడలు రెండు రిబ్బన్లు ఉజ్జయిని సర్కిల్ మధ్యప్రదేశ్ రాష్ట్రము వారు నిర్వహించిన జాతీయ స్థాయి సెలాన్ లో రావడం జరిగింది. ఈ అవార్డులను సెప్టెంబర్లో మధ్యప్రదేశ్లో అందుకోనున్నారు. బహుమతి రావడం పట్ల, తోటి ఫోటోగ్రాఫర్లు, పలు సంఘ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.










## ఘనంగా రక్షా బంధన్ వేడుకలు

**సూర్య రుద్రంగి**



రుద్రంగి మండలంలో గురువారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. అక్కాచెల్లెలు అన్నదమ్ములకు రాఖీలు కట్టి తమ ప్రేమను చాటుకున్నారు. రాఖీలు కట్టిన అక్కాచెల్లెలకు సోదరులు కట్నకానుకలు బహుకరించారు. రక్షా బంధన్ సందర్భంగా మండలంలోని బస్టాండ్ వద్ద రాఖీ దుకాణాలు, బస్సులలో రద్దీ పెరగడంతో పండగ వాతవరణం నెలకొంది. మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్యకు తన సోదరీమణులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ప్రజాప్రతినిధులు, నాయకులు మండల ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ సీతారామ ఆంజనేయ దేవాలయంలో పూజలు

**-పద్మశాలి సమాజ సేవ సంఘం ఆధ్వర్యంలో..**

**సూర్య బోయినపల్లి**



బోయినపల్లి మండలం కొత్తపేటలో జంద్యాల పూర్ణిమా పురస్కరించుకొని సోమవారం పద్మశాలిసమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ సీతా రామ ఆంజనేయ దేవాలయం లో పూజలు ఘనంగా నిర్వహించారు. సామూహికంగా పద్మశాలి కులస్తులు జంధ్యాలు వేసుకున్నారు అనంతరం అన్నప్రసాధం దేవాలయ ఆవరణలో పంపిణీ చేశారు .ఇట్టి కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు మాజీ ఏఎంసి డైరెక్టర్ చిందం వేణు గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షులు ద్యావనపల్లి శ్రీహరీ తో పాటు సహచర కార్యవర్గ సభ్యులు ఆలయ కమిటీ చైర్మన్ గుందేకార్ల రమేశ్ ,ఆలయ కమిటి కార్యవర్గ సభ్యులు పద్మశాలి కులభాందవులు పాల్గొన్నారు.

## ఆధార్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోండి

**సూర్య సిరిసిల్ల టౌన్ 03**




సిరిసిల్ల పట్టణంలోని స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద బిఎస్ఎన్ఎల్ టెలికాం సంస్థ వారి ఆధ్వర్యంలో నూతన శాశ్వత ఆధార్ సెంటర్ ను బిఎస్ఎన్ఎల్ డీజీఎం పొన్నం అజయ్ ప్రారంభించినారు.ఈ సందర్భంగా డిజిఎం మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్ సేవలను ప్రజలందరూ సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ డిఈ దొర వెంకటేశ్వర్లు,ఎస్డిఈ ఎం.జనార్ధన్, తిరుమల్,జెటిఓ నరేష్,జేఈఈ వేంకటేశ్వర్లు, సిబ్బంది, బిఎస్ఎన్ఎల్ డీలర్ కూస రామచంద్రం,ముష్ణం విజయ్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి రాఖీ కట్టిన సోదరి లీలా

**సూర్య వేములవాడ**



రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడ శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ కు వారి స్వగృహంలో తన సోదరి లీలా రాఖీ కట్టి స్వీట్స్ తినిపించారు. అన్న చెల్లెళ్ళ అనుబంధం, ఆత్మీయ అనురాగలకు మారు పేరు రాఖీ పౌర్ణమి పండుగ అని ప్రభుత్వ విప్ అన్నారు. నియోజకవర్గ సోదర సోదరీమణులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు మండలంలో పర్యటించనున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**సూర్య బోయినపల్లి**



బోయినపల్లి మండలంలో మంగళవారం పర్యటించనున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. ఉదయం 10:30 నిమిషాలకు తడగొండలో స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం చేన్నాడి రవీందర్ రావు స్మారకర్థం స్తంభంపల్లి గ్రామ హైస్కూల్లో విద్యార్థులకు బెంచిల బహుకరణ కార్యక్రమం కు హాజంవుతారు.బోయినపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి మీడియాకు తెలిపారు.

**నిర్ణీత గడువులోగా ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి...**

## జిల్లా కలెక్టర్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సూర్య సిరిసిల్ల టౌన్**



నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ ంములో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.వివిధ శాఖల నుండి 9 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్లో పెట్టవద్దని అధికారులను ఆదేశించారు.

## రాజన్న దర్శించుకున్న జిల్లా కలెక్టర్

**సూర్య వేములవాడ**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా కుటుంబ సమేతంగా దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఆలయ ప్రోటోకాల్ పర్యవేక్షకులు రాజన్ బాబు కలెక్టర్ కుటుంబానికి శేషవస్త్రం, లడ్డు ప్రసాదం అందించారు.

## పలు ఆలయాల్లో పూజలు నిర్వహించిన మాజీ సర్పంచ్

**సూర్య బోయిన్పల్లి**



బోయినపల్లి మండలం తడగొండ గ్రామ మాజీ సర్పంచ్ చిందాం రమేష్ సోమవారం తన పుట్టినరోజును పురస్కరించుకుని గ్రామంలోని హనుమాన్, శ్రీ వేంకటేశ్వర స్వామి ,సాయిబాబా ఆలయాలు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంట ప్రజలు సుఖ సంతోషాలతో విరజిల్లాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి హనుమాన్ దేవాలయంలో హోమం నిర్వహించిన భక్తులు

**సూర్య, కొత్తపల్లి**



కొత్తపల్లి పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో హనుమాన్ భక్త కమిటీ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు పట్టణంలోని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఘనంగా అనేక కార్యక్రమాలు ఆలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

# అక్రమంగా చేపల చెరువులు నిర్మాణం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

**- గీకురు రవీందర్, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్, ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి**

**సూర్య చిగురు మామిడి....**



చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూరు గ్రామపంచాయతీ పరిధిలోని పెద్ద చెరువు శిఖములో నీటి విస్తీర్ణం పరిధిలో (ఎఫ్టిఎల్ ) అక్రమంగా చేపల చెరువులు నిర్మించారని, తక్షణమే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఫమేల సత్పతికి స్థానిక మాజీ జడ్పీటీసీ సభ్యులు, జిల్లా ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి గీకురు రవీందర్ ఫిర్యాదు చేశారు. చిగురుమామిడి మండలం, చిన్న ముల్కనూరు గ్రామపంచాయతీ పరిధిలోని పెద్ద చెరువు నీటి విస్తీర్ణం(FTL) పరిధిలో సర్వే నంబర్ 1907, 1927, 1928, 1940 భూములను కూనచ్చుల మహేందర్ లీజులకు తీసుకొని చేప పిల్లల పెంపకం చెరువులు నిర్మాణం చేసినారు. కూనచుల మహేందర్ టెండర్ల లో వాడుతున్న అన్ని సర్వే నంబర్లు కూడా పూర్తిగా 'పెద్ద చెరువు' నీటి విస్తీర్ణం ఎఫ్టీఎల్ లపరిధిలో కలిగి ఉన్నవి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మానాలు చేపట్టి స్థానిక మత్స్య కార్మికులను అన్యాయం చేస్తున్నాడు.గత రెండు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల సరఫరా పథకం టెండర్లలో పాల్గొని టెండర్లు దక్కించుకున్నాడు. ఇట్టి చేపల చెరువు నిర్మాణము ఎఫ్టిఎల్ ల పరిధిలో ఉన్నాయని గతంలో అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ మత్స్యశాఖ అధికారులను, రెవెన్యూ అధికారులను, ఇరిగేషన్ అధికారులను తప్పు త్రోవ పట్టిస్తూ టెండర్లు దక్కించుకున్నాడు. అదేవిధంగా ఈ సంవత్సరం 2024-25 సంవత్సరంకుగాను రాష్ట్ర ప్రభుత్వ మత్స్యశాఖ నిర్వహించిన టెండర్లలలో పాల్గొని కరీంనగర్ జిల్లాకు టెండర్ వేసి టెండర్లు దక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. కూనచుల మహేందర్ మత్స్యశాఖ నిర్వహిస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీ టెండర్లలో పొందుపరిచిన సర్వే నంబర్లు గల భూమిలన్నింటిపై సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎఫ్టిఎల్ పరిధిలో చేపల చెరువుల నిర్మాణం చేసిన కూనచ్చుల మహేందర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరము 2024- 25 సం.నకు గాను టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించద్దన్నారు.

## నాకు నువ్వు రక్ష-నీకు నేను రక్ష... మనమంతా ఈ దేశానికి రక్ష...

**సూర్య చిగురు మామిడి...**



చిగురుమామిడి మండలంలోని అన్ని గ్రామాల్లో రక్ష బంధన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. తోడబుట్టిన సోదరికి జీవితాంతం కష్టసుఖాలలో తోడుంటానని సోదరుడు ఇచ్చేఅభయమేరక్షాబంధన్ తరాలు మారిన యుగాలు గడిచిన వన్నె తరగనిది ఈ రాఖీ పండుగ అని అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి, ప్రేమాప్యాయతలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను మండల ప్రజలంతా సంతోషల మధ్య జరుపుకున్నారు.నాకు నువ్వు రక్ష నీకు నేను రక్ష మనమంతా ఈ దేశానికి రక్ష అంటూ రాఖీలు కట్టుకున్నారు.ఈ రాఖీ పండుగ అందరి బంధాల్లో కొత్త మాధుర్యాన్ని, జీవితంలో ఆనందం, శ్రేయస్సు తీసుకురావాలని పలువురు ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



## ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**సూర్య కొత్తపల్లి**

కొత్తపల్లి మండలంలోని సీతారాంపూర్ లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పెద్దలు , చిన్నారులు సంతోషంగా రాఖీ పౌర్ణమిని జరుపుకున్నారు.

**సూర్య కొత్తపల్లి**



బీ కొత్తపల్లి పట్టణంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు జరిగాయి. పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు నివాసంలో రక్షాబంధన్ వేడుకలు వారి సోదరీమణులు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేను నీకు రక్ష...నీవు నాకు రక్ష...మనిద్దరం దేశానికి రక్ష అంటూ రాఖీ పౌర్ణమి వేడుకలు

**సూర్య సిరిసిల్ల టౌన్**

అన్న చెల్లెల్లు...అక్క తమ్ముళ్ల....అనుబంధానికి ప్రత్యేకగా నిలిచే స్వచ్ఛమైన పండుగ రాఖీ పౌర్ణమి వేడుకలు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఘనంగా నిర్వహించారు.కుల మతాలకతీతంగా రాఖీ వేడుకలు నిర్వహించారు. నేను నీకు రక్ష...నీవు నాకు రక్ష...మనిద్దరం దేశానికి రక్ష అంటూ రాఖీ పౌర్ణమి వేడుకలు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఘనంగా నిర్వహించారు.అక్కలు చెల్లెల్లు తన తోడబుట్టిన అన్నలకు తమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు ఉత్సాహం చూపారు.నేటి తెల్లవారు జాము నుండి మహిళలు తమ తోడబుట్టిన వారికి రాఖీలు కట్టేందుకు వివిధ ప్రాంతాలకు బయలుదేరి వెళ్లారు.రాఖీ పండుగ సందర్భంగా రాఖీల కొనుగోలు జోరుగా సాగాయి.సిరిసిల్ల పెద్ద బజార్ మార్కెట్ ఏరియా వివిధ రకాలుగా రాఖీల కొనుగోలు జోరుగా సాగాయి. పది రూపాయల నుండి మొదలుకొని 200 వరకు రాఖీల రేట్లు



పలికాయి.ఈసారి రాఖీల రేట్లు అంతంత మాత్రమే ఉన్నప్పటికీ కొనుగోలు మాత్రం జోరుగానే సాగింది ఏ దుకాణం కాడ చూసిన మహిళల సందడి కనిపించింది తన తమ్మునికి,అన్నయ్యకు అందమైన రాఖీ కట్టాలని ఉత్సాహం మహిళల కళ్ళల్లో కొట్టొచ్చినట్లు కనిపించింది. కుటుంబ సభ్యుల సమక్షంలో తమ వారికి రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.మరోవైపు తమవారికి నోటి తీపి చేసేందుకు స్వీట్ల కొనుగోలు జోరుగా సాగాయి.

సిరిసిల్ల పట్టణంలో స్వీట్ల కొనుగోళ్ల కోసం బారులు తీరారు.ఇంకోవైపు తమవారికి రాఖీలు కట్టేందుకు వివిధ ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలపై,ఆటోలు,కార్లు,బస్సులలో తరలి వెళ్లారు.రాఖీ పండగ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో వివిధ ప్రాంతాలకు తరలి వెళ్లడంతో ఏ బస్సు చూసిన మహిళలతో కిక్కిరిసి పోయింది. సిరిసిల్ల పాత బస్టాండ్ మహిళలతో కిటకిటలా డింది.ఒక్కో బస్సులో 100 నుండి 150 మంది మహిళలు తమ వారికి రాఖీలు కట్టేందుకు తరలి వెళ్లారు. సిరిసిల్ల, వేములవాడ డిపోకు చెందిన అన్ని బస్సులను ఎక్కువ రద్దీ ఉన్న ప్రాంతాలకు తరలించారు. మహిళలకు పండగ పూట ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని ఆర్టీసీ పరంగా అన్ని చర్యలు తీసుకున్నట్లు డిపో మేనేజర్ ప్రకాష్ రావు తెలిపారు. మొత్తానికి రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా రాఖీ పండుగ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి.

## దుబాయ్ లో కార్మికులకు రాఖీ కట్టిన ప్రియా సింగిరెడ్డి

**సూర్య వేములవాడ**



వేములవాడ నియోజకవర్గం మల్లారం గ్రామానికీ చెందిన వెంకట్ రెడ్డి, ప్రియా సింగిరెడ్డి దంపతులు గత 15 ఏళ్లుగా యూఏఈ లోని అబుదాబిలో స్థిరపడా ్డరు. ప్రతీ ఏటా అబుదాబి నుంచి బర్ దుబాయ్ ఏరియాలో ఉన్న మన నియోజకవర్గ కార్మికులకు మోతే రాములు , బొల్లి కుమార్, ఇతర వ్యాపారుల కంపెనీ స్టాఫ్కి రాఖీలు పంపిస్తారు. ఇదంతా స్థానికంగా ఉంటున్న మల్లేష్ కోరేపు ప్రియ దంపతులకు సన్నిహితుడు శంకర్ తో సమన్వయం చేసి ప్రతి ఏటా ప్రియా సింగిరెడ్డి పంపిన రాఖీలు అందరూ కట్టుకునే ఏర్పాట్లు చేస్తారు. ఈ సారి సెలవు రోజు రావడం వల్ల తానే స్వయంగా 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించి, అందరికి తనచేతులతో రాఖీలు కట్టారు. ఇంత మంది నా అన్నలకు తమ్ముళ్లకు రాఖీలు కట్టడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని పేర్కొన్నారు. అలాగే కార్మికులు అధైర్యంతో ఆత్మ హత్యలకు పాల్పడొద్దని, ఏదైనా సమస్య వస్తే నా వంతు సహాయం అందిస్తానని, వారితో తెలియజేసారు. ఇంతకు ముందు కూడా నియోజకవర్గ గ్రామాల్లో పలు సమస్యల్లో ప్రియా సింగిరెడ్డి సేవలు చేసినట్టు 'నా కలం నా అక్షర సత్యం' ఫేస్బుక్ పేజీ టీమ్ సభ్యులు మానాల వంశీ చెప్పారు.రాఖీ కట్టిన ప్రియా సింగిరెడ్డి గారికి బొల్లి కుమార్, మల్లేష్ కోరేపులు పట్టు చీరను ఆడ పడుచు కట్నంగా పెట్టి, కండువాతో సత్కరించారు. రాఖీలు కట్టుకున్న దేశావేని శంకర్, మోతె బాబు ,కిషన్, కుమార్ ఎగుర్ల, జెడ మల్లేష్, తిరుపతి, నందు, లక్ష్మణ్, కిషన్, సుమంత్, రాము కటకం తదితరులు పరాయి దేశంలో మన ఆడపడుచుతో రాఖీ కట్టించుకొవడం మరిచిపలేమని ఆనందం వ్యక్తం చేశారు.

## హర్ ఘర్ జల్ పథకాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

**సూర్య బోయినపల్లి**



దేశంలోని ప్రతి గ్రామీణ ఇంటికీ కుళాయి నీటి సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ (జేజేఎం) కింద హర్ ఘర్ జల్ పథకాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగానే బోయినపల్లి మండలం లో నీ తడగొండ గ్రామంలో కేంద్ర బృందం ఇంటింటా హర్ ఘర్ జల్ సర్వే నిర్వహించి ప్రతి ఇంటికి నల్లా ఉండడం తో పాటు ప్రతి రోజూ నీటి సరఫరా సక్రమంగా జరగడంతో కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తపరిచారు.ప్రతి రోజూ నీటి సరఫరా సక్రమంగా జరగడానికి కార్యదర్శి చేసిన కృషి నీ చూసి కార్యదర్శి బోడపట్ల మల్లేష్ నీ అభినందించిన కేంద్ర బృందం.ఈ కార్యక్రమంలో కార్యదర్శి బోడపట్ల మల్లేష్ ఆర్ డబ్లుఏస్ ఏఈ అభిషేక్ కుమార్,ఆర్ డబ్లు ఏస్ హెల్పర్ ప్రమీల, కరోబర్ బాబు,ఆశా వర్కర్స్ సునీత,అనసుర్యా, గ్రామపంచాయతీ సిబ్బంది తదితులున్నారు.

## న్యాయవాదిపై దాడికి నిరసనగా విధుల బహిష్కరణ

**సూర్య వేములవాడ**



వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విధులు బహిష్కరించినట్లు బార్ అసోసి యేషన్ అధ్యక్షులు గుడిసె సదాన ందం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా కూకట్ పల్లి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న పి.సంతోష్ అనే న్యాయవాదిని బోరబండ ఇన్స్పెక్టర్ జమాల్ బనియన్, లుంగీపైనే ఇంటి నుండి దారుణంగా ఈడ్చుకెళ్లి న్యాయవాదిపై దాడి చేయ డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయవాదులపై నిత్యం పోలీసుల దౌర్జన్యాలకు నిరసనగా “తెలంగాణ అడ్వకేట్స్ ఫెడరేషన్” ఇచ్చిన పిలు పుమేరకు విధులు బహిష్కరించామని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాద రక్షణ చట్టంపై బిల్లు ప్రవేశపెట్టి, వెంటనే అమల్లోకి తేవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రతాప సంతోష్, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ ,నేరెళ్ల తిరుమల్ గౌడ్, రేగుల దేవేందర్, పిట్టల మనోహర్, వేముల సుధాకర్ రెడ్డి, పెంట రాజు, నక్క దివాకర్, నాగుల సంపత్, కోడం రత్నయ్య, పిల్లి మధు, బొడ్డు ప్రశాంత్ కుమార్, మాదాసు దేవయ్య, రేగుల రాజ్ కుమార్,దొబ్బల ప్రవీణ్ , మహిళా న్యాయవాదులు అన్నపూర్ణ,పద్మ పాల్గొన్నారు.

## చెట్లకు రాఖీలు కట్టిన ప్రకృతి ప్రేమికురాలు బ్లేస్సి

**సూర్య కోనరావుపేట**



రాఖీ పండుగ వేళ చిన్నారి బెస్లీ పర్యావరణహితాన్ని చాటింది. ప్రాణ వాయువుని ఇచ్చే చెట్లకు రాఖీలు కట్టి అనుబంధానికి సరికొత్త నిర్వచనం ఇచ్చింది.రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన. ప్రకృతి ప్రకాష్ కూతురు బ్లేస్సి (10) స్వయంగా 100 రాఖీలను పేపర్ తో తయారుచేసి తన ఇంటి ఆవరణంలో తాను నాటిన చెట్లకు రాఖీలనుకట్టి పర్యావరణ ప్రేమను చాటింది.బేస్సి గత ఐదు సంవత్సరాలుగా రాఖీలను తయారు చేస్తూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న హరితహారంలో నాటిన చెట్లకు సైతం రాఖీలను గతంలో కూడా కట్టింది. రెండు రోజులుగా పేపర్ రాఖీలను తయారుచేసి ఈరోజు 100 రాఖీలను కట్టింది. ఈ చిన్నారి తన తండ్రితో కలిసి రాలిన విత్తలను సేకరించి విత్తన బంతులను చేసి తన తండ్రి సహాయంతో అటవీ ప్రాంతాల్లో వెదజల్లింది. రాఖీలు సోదరులకే పరిమితం కాదని సోదరులతో పాటు మనం పుట్టినప్పటినుంచి చెట్లు తమ ప్రాణవాయువు ఇస్తూ మనం కనుమూసి కాలగర్భంలో కలిసిపోయేంతవరకు కంటికి రెప్పలా కాపాడుతూనే ఉన్నాయని ఈ చెట్లే మనకు నూరేళ్ల రక్ష అని రక్షాబంధన్ లో భాగంగా ప్రతి ఒక్కరు చెట్లకు రాఖీలు కట్టాలని కోరింది.

## సిరిసిల్లలో ఘనంగా నూలు పౌర్ణమి శోభయాత్ర

**సూర్య సిరిసిల్ల టౌన్**



సిరిసిల్ల శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవస్థానంలో నూలు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు.వేదమూర్తులైన పద్మోత్తముల సమక్షంలో యజ్ఞోపవీతం గావిం చారు. సిరిసిల్ల పద్మశాలీల ఆరాధ్య దైవం శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవస్థానంలో నూలు పౌర్ణమి వేడుకలు నేత్ర పర్వంగా జరిగాయి.నూలు పౌర్ణమిని జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు.పద్మోత్తముల సమక్షంలో భక్త మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం యజ్ఞం నిర్వహించారు.ఆ తర్వాత వచ్చిన భక్తులకు పూజించిన జంధ్యాలను అందించి ధరించారు.సాయంత్రం నువ్వులు పౌర్ణమినీ పురస్కరించుకొని శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు.మార్కండే దేవాలయం నుండి ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక యాత్ర గాంధీచౌక్, అంబ ేద్కర్,నేతన్న చౌరస్తా,పెద్ద బజార్ మీదుగా తిరిగి మార్కండేయ దేవాలయం వరకు సాగింది. ఈ యాత్రలో మగ్గంపై వస్త్రాన్ని నేస్తూ ర్యాలీ అనంతరం నేసిన వస్త్రాన్ని స్వామివారికి సమర్పిస్తారు.భక్తుల భజనలతో నృత్యాలతో మార్కండేయ స్వామి శోభాయాత్ర కనుల పండుగగా జరిగింది.

## నలుగురు డీజే నిర్వాహకులపై కేసు నమోదు

**డిజె సిట్టింగ్‌లను ఉపేక్షించే ప్రసక్తే లేదు**

**సూర్య తంగళ్లపల్లి**



తంగళ్ళపల్లి మండలంలో నిన్న రాత్రి అనగా 18-08-2024 రోజున జిల్లెల మరియు తంగళ్ళపల్లి గ్రామాల్లో అక్రమంగా డీజే సిట్టింగ్ లు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు తంగళ్ళపల్లి ఎస్సై డి.సుధాకర్, ఏఎస్సై చంద్రమౌళి, మరియు సిబ్బంది శ్రీనివాస్,లతో కలిసి జిల్లెల గ్రామినికి వెళ్లగా అక్కడ డీజేలను నిర్వహించి ప్రజల యొక్క ఆరోగ్యానికి హాని కలిగేలా పెద్ద పెద్ద శబ్దాలతో డీజేలు నిర్వహిస్తున్న మూడు సౌండ్ సిస్టంలని సీజ్ చేయడం జరిగింది అని మరియు తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని బాబాజీ కాలనిలో కూడా ప్రజల ప్రాణాలకు హాని కలిగేలా పెద్ద పెద్ద శబ్దాలతో డీజేలు నిర్వహించడంతో పాటు దారిపైన గుమిగూడి రాకపోకలకు అంత రాయం కలిగించిన న్యూసెన్స్ చేసిన అట్టి డీజే సిస్టంలను సీజ్ చేసుకుని నలు గురు డీజే నిర్వాహకులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలి పారు.అక్రమంగా పెద్ద శబ్దాలతో డీజేలు నిర్వహించిన వ్యక్తులు నేరెళ్లకు చెందిన పోలాడి.నవీన్ పైన మరియు తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన కోడం. పృథ్వి,పంది.సాయికుమార్, కోడం.ప్రశాంత్‌లపై కేసు నమోదు చేసినట్లు తంగళ్ళపల్లి వస్తే డి.సుధాకర్ తెలిపారు. అనుమతులు లేకుండా పెద్ద శబ్దాల తో డీజేలు పెట్టిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, డీజే నిర్వాహకులు ప్రజల యొక్క ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టు కొని శబ్ద కాలుష్యాన్ని సృష్టించకుండా ఉండాలని ఎవరైనా చట్టాన్ని అతిక్ర మిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తంగళ్ళపల్లి ఎస్సై సుధాకర్ తెలిపారు.

## చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..

**-మాల మహానాడు సంఘం నాయకుల పిలుపు**

**సూర్య వేములవాడ**



ఈ నెల 22న జరిగే రాజన్న సిరిసిల్ల జిల్లా చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడుసంఘం నాయకుల పిలు పునిచ్చారు. ఈ సందర్భంగా వేము లవాడ పట్టణంలో సోమవారం మీడియా సమావేశంలో నిర్వహించి, చలో కలెక్టరేట్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో క్రిమిలేయర్ పేరుతో ఎస్సీల హక్కుగా ఉన్న రిజర్వేషన్ రద్దు చేసే కుట్రను బిజెపి చేస్తుందని తెలిపారు. అందుకు నిరసనగా చలో కలెక్టరేట్ కార్యక్రమంలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని మారుస్తామని బిజెపి నాయకులు ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే రాజాసింగ్‌లు బహిరంగంగానే మాట్లాడారని గుర్తుచేశారు. కానీ ప్రజల దెబ్బకు తగినన్ని సీట్లు రాకపోవడంతో తోక ముడిచారని, ఎస్సీలను చీల్చడానికి నిరసనగా ఆగస్టు 22 ఉదయం 11 గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.





# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

అన్నా చెల్లి అక్క తమ్ముళ్ల ఆప్యాయత అనురాగాల మధ్య రక్షాబంధన్ వేడుకలను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తమ సోదరీమణులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ నీవు నాకు రక్ష నేను నీకు రక్ష అంటూ మనస్ఫూర్తిగా కోరుతూ సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వదించి, సోదరుల ఆతిథ్యాన్ని కట్న కార్మికులను స్వీకరించారు. కాలము మారిన దూరము పెరిగిన అదే అనుబంధ రాగాలతో ఆనందోత్సవాల మధ్య రాఖీ వేడుకలు జరుపుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన సోదరీమణులు తమ అన్న తమ్ముళ్ల ఇంటికి చేరుకొని రాఖీలు కట్టి ప్రేమానురాగాలను పంచారు. ఉదయము ఆలయాల్లో భక్తులు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.













జిల్లా కలెక్టర్‌కు రాఖీలు కట్టిన

# బాల సధన్ చిన్నారులు

**సూర్య జగిత్యాల**

మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్ర బృందం ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయం మీటింగ్ హాల్ లో, బేటి బచావో బేటి పడావో పథకంలో భాగం గా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ కు, అడిషనల్ కలెక్టర్ రాంబాబుకు, ఆర్డీవో లు, జిల్లా అధికారులందరికీ, కార్యాలయ సిబ్బందికి బాల సదన్ పిల్లలతో రాఖిలు కట్టించి స్వీట్స్ పంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి డా. నరేష్, మిషన్ శక్తి స్కీం కింద వున్న స్కీమ్స్ గురించి వివరించారు. ఇందులో మహిళా సాధికారిత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ అశ్విని, హబ్ స్టాఫ్, ఎఫ్ ఆర్ వో కొండయ్య, సఖి స్టాఫ్ పాల్గొన్నారు.



# ఎల్లప్పుడూ మేము మీకు అండగా ఉంటాం

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్**

**సూర్య తంగళ్లపల్లి**

తంగలపల్లి మండలం కేంద్రంలో రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ మహిళ రెసిడెన్షియల్ ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలను సందర్శించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మాది ఉమ్మడి కుటుంబం అని నాకు తొమ్మిది మంది అక్కచెల్లెళ్లు రాఖీ పండుగ సందర్భంగా నాకు రాఖీ కట్టడానికి ఈ రోజు నా దగ్గర ఎవరు లేరు నా అక్కచెల్లెళ్ల స్థానంలో మీరు అందరూ నాకు రాఖీ కట్టాలని నేను మీకు రక్షగా ఉంటానని అన్నారు.జిల్లాలో మహిళల రక్షణకు అనేక కార్యక్రమాలు నిరహిస్తున్నాం అని అందులో భాగంగా ఆపరేషన్ జ్వాలా కార్యక్రమంతో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ పైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని,విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ నేర్చుకొని పురుషుల నుండి రక్షణ తీసుకునే స్థాయి నుండి పురుషులను రక్షించే స్థాయి మహిళలు ఎదగాలన్నారు. విద్యార్థినిలకు, పాఠశాల,కళాశాల విద్య చాలా ముఖ్యమైనదని ఎవరు కూడా మీ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకుండా మంచిగా చదువుకోవాలని ప్రతి ఒక్క ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడి అమ్మానాన్నలకు, మనకు చదువు నేర్పిన ఉపాధ్యాయులకి మంచి పేరు తీసుకరవలన్నారు.విద్యార్థినిలు మహిళలు మౌనం విడి ముందుకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని,నిర్భయంగా ముందుకు వచ్చి మీ సమస్యలను చెప్పుకున్నప్పుడే మరింత భద్రత కల్పించగలువు తామని, మహిళలు,విద్యార్థినిలు,వెంటనే 100,జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు. పిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు.ఎస్పీ వెంట సి.ఐ మొగిలి,ఎస్.ఐ సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్,సిబ్బంది ఉన్నారు.

# జగిత్యాల లో భారీ వర్షం

**- జలమయమైన కాలనీలు**

**సూర్య జగిత్యాల**



జగిత్యాల పట్టణంలో సోమవారం భారీ వర్షం కురిసింది. గంటపాటు ఏకదాటిగా కురిసిన వర్షానికి రోడ్లు జలమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని పలు ఇళ్లలోకి నీరు చేరింది. పట్టణంలోని ధరూర్ క్యాంపు, హౌసింగ్ బోర్డ్, తీన్ ఖని ,టవర్ సర్కిల్, ఖిలాగడ్డ, జెండా మహల స్ట్రీట్, మహాలక్ష్మీ నగర్ ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరి తీవ్ర ఇబ్బంది పడ్డారు. మార్కండేయ నగర్ లో రోడ్లపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించి ఇండ్ల బయట నిలిపి ఉంచిన వాహనాలు నీట మునిగిపోయాయి.

# ఆరోగ్యం కోసం... కూరగాయల జ్యూస్

**- గుమ్మడికాయ జ్యూస్‌కు డిమాండ్**

**సూర్య, హుజురాబాద్.**

ప్రస్తుత యాంత్రిక యుగంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం ముఖ్యమని భావిస్తున్న తరుణంలో ఆరోగ్యంపై ఎంతో ప్రభావాన్ని చూపే కూరగాయల జ్యూస్ పై ప్రజలు మక్కువ చూపిస్తున్నారు. సరైన సమయంలో భోజనాలు చేయని వారికి రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తూ అల్సర్ షుగర్ బిపి లాంటి అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో ప్రజలు కొత్త కొత్త ఆహార పదార్థాలు తీసుకోవడంపై మక్కువ చూపుతున్నారు. గతంలో తెల్లగా , సన్నగా ఉండే బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడాన్ని గొప్పగా భావించే వారు కానీ నేడు దొడ్డు బియ్యం తినడానికి మక్కువ చూపుతున్నారు. ఒకపూట భోజనం చేయడమే మేలని భావిస్తూ ఉదయం సాయంత్రం జ్యూస్ లేదా టిఫిన్ లాంటివి తింటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం కూరగాయల జ్యూస్ కు భలే డిమాండ్ పెరిగింది. ప్రస్తుత మార్కెట్లో గుమ్మడికాయ , క్యారెట్ గోధుమ గడ్డి సొరకాయ బీట్రూట్ కీరదోస టమాటా కాకర కాయల జ్యూసులు తాగడానికి ప్రజలు ఆసక్తికరపరుస్తున్నారు. ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూరగాయలు పనులను



మించినవి లేవని అందరూ అంగీకరిస్తారు కూరగాయల జ్యూస్ తీసుకోవడం వల్ల మనిషి యొక్క అందం పెరగడమే కాకుండా ఆరోగ్యం కూడా లభిస్తుంది ఈ జ్యూసులు తాగడం వల్ల నీరసం తగ్గడం మధుమేహం కంట్రోల్లో ఉండడం విటమిన్ ఎ,బి, సి, లు లభిస్తాయి బూడిద గుమ్మడికాయ జ్యూస్ తాగడం వల్ల శరీరంలో నీటి శాతం పెరగడం విష పదార్థాలు తొలగించడం బిపి అదుపులో ఉండడం గుండె సమస్యలు రాకుండా ఉండడం మలబద్ధకం బరువు తగ్గడం లాంటివి ఉండడంతో చాలామంది గుమ్మడికాయ జ్యూస్ తాగడానికి ఇష్టపడుతున్నారు. ప్రజల డిమాండ్ అనుసరించి పలు పట్టణాల్లో పండ్ల జ్యూసుల బదులుగా కూరగాయల జ్యూసులు అమ్మే దుకాణాలు వెలుస్తున్నాయి. హుజురాబాద్ పట్టణంలో హెల్తీ



360 పేరుతో కూరగాయల జ్యూస్ షాపును సామ శివ సాయి అనే యువకుడు ప్రారంభించాడు. ఆరోగ్యం పై మక్కువ ఉన్నవారు ఉదయం సాయంత్రం వేళల్లో గుమ్మడికాయ కీరదోస గోధుమ గడ్డి బీట్రూట్ టమాట జ్యూస్ లాంటివి అప్పటికప్పుడు తయారు చేయించుకుని తాగి వెళ్తున్నారు. ఏది ఏమైనా ఆరోగ్యం కోసం ప్రజలు పాత పద్ధతుల్లో వెళ్తుండడం కోసమేరుపు.

## గుమ్మడికాయ జ్యూస్ కు డిమాండ్

**- శివ సాయి**

కూరగాయల జ్యూసుల్లో గుండె సంబంధమైన వ్యాధులకు రక్షణగా ఉండడంతో గుమ్మడికాయ జ్యూస్ కు ఎక్కువ డిమాండ్ ఉంటుందని హెల్తి 360 దుకాణ యజమాని శివ సాయి తెలిపారు.

# కెమెరాకు , కెమెరా సృష్టి కర్త లుయిస్ డాగ్రే చిత్ర పటానికి రాఖీ కట్టిన ఫోటో గ్రాఫర్లు

### - రాఖీ పండగ సందర్బంగా వినూత్న కార్యక్రమం

**సూర్య మెట్‌పల్లి:-**

మెట్‌పల్లి కెమెరా క్లబ్ సభ్యులు ప్రపంచ ఫోటో గ్రఫి దినోత్సవాన్ని పురస్కరించుకొని సంబరాలు ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్రే జన్మదినం సందర్భంగా ప్రతి సంవత్సరం కార్యక్రమం జరుపుతారు. అందులో భాగంగా ఈ సంవత్సరం రాఖీ పౌర్ణమి రావడంతో కెమెరా కు, ఆయన చిత్ర పటానికి రాఖిలు కట్టి నువ్వు మాకు రక్షా మేము నీకు



రాక్ష నీతోనే మా జీవితాలకు రక్ష అంటూ సంబరాలు జరిపారు.అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు.అనంతరం ఫోటో గ్రాఫర్లు మాట్లాడుతూ కెమెరా అనే పరికరం ద్వారా కోట్లది మంది జీవితాలు బాగుపడ్డాయని అందుకు కెమెరా మాకు రక్ష అని అన్నారు. ఈ కార్యక్రమం లో అధ్యక్షులు పెరంబుధురి శ్రీధర్, పిట్ల రాంప్రసాద్, రాజారపు గంగ రాజం, చిలువేరి మహేష్, గుజ్జెటి శ్రీనివాస్, ముదం శ్రీనివాస్, గుండా రాకేష్, జ్ఞానేశ్వర్, అరుణ్, శేఖర్, సంతోష్, అజర్ తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి మండల వ్యవసాయధికారి గా మహమ్మద్ షాహిద్ ఆలీ

**సూర్య మేడిపల్లి**



బితెలంగాణ రాష్ట్రంలో పలువురు వ్యవసాయాధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయగా మేడిపల్లి మండలంలో గత 7సంవత్సరాలుగా సేవలను అందించిన వ్యవసాయాధికారి త్రివేదిత కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలానికి బదిలీ పై వెళ్ళారు.ఏ ఈ ఓ గా భాధ్యతలు నిర్వహించిన వంశీ మల్లాపూర్ మండలం లోని చిట్టాపూర్ క్లస్టర్ కు బదిలీ పై వెళ్ళారు.కాగా మెట్పల్లి లో సేవలందించిన వ్యవసాయాధికారి మహమ్మద్ షాహిద్ ఆలీ సోమవారం రోజు మేడిపల్లి మండల వ్యవసాయాధికారిగా భాధ్యతలు స్వీకరించారు.కొడిమ్యాల మండలం నుండి బదిలీ పై వచ్చిన శ్రీలత మేడిపల్లి క్లస్టర్ భాధ్యతలు స్వీకరించారు.

## బంటుపేట నూతన కార్యవర్గం ఎన్నిక..

### - అధ్యక్షుడిగా కార్తీక్

**సూర్య మెట్‌పల్లి:-**



మెట్‌పల్లి పట్టణం బంటుపేట కాలని బంటపేట యువ సేన నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. యువసేన అధ్యక్షుడిగా బిట్లుగు కార్తీక్ గౌరవ అధ్యక్షుడిగా కారం మారుతి, ప్రధాన కార్యదర్శి గా కంబ సురేష్, ఉప అధ్యక్షు లుగా కారం కిషోర్, కారం శివ క్యాషియర్ గా గుమ్మడి విక్రమ్, సంయుక్త కార్యదర్శి గా బొల్లుమల్ల కిరణ్, సలహా కమిటీ చైర్మన్ దొంగేరి శ్రీనివాస్, సలహా దారులు కారం నరేష్, కంబ అశోక్, గుమ్మడి రవి, గోరమంతుల నవీన్ , కార్యవర్గ సభ్యులు గా కారం అనిల్, కారం రాజశేఖర్, బోలుమల్ల నవీన్ లను ఎన్నుకున్నారు. బంటుపేట యువసేన ఆద్వర్యంలో పట్టణంలో ప్రతి సంవత్సరం వినాయక, దుర్గ నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తామని ఈ సంవత్సరం కూడా ఉత్సవాలకు యువ సేన సభ్యులు సిద్ధమైనట్లు వారు తెలిపారు.



## ఫోటోగ్రాఫర్లకు సన్మానం..

**సూర్య మెట్‌పల్లి:-**

నేటి సంఘటనలను రేపటి జ్ఞాపకాలుగా మలిచేవి ఫోటోలు మాత్రమేనని, ఫోటోగ్రాఫర్ల నైపుణ్యం వెల కట్టలేనిదని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇల్లేందుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని పట్టణ సీనియర్ ఫోటోగ్రాఫర్స్ గుండా రాకేష్, సాంబారి శ్రీనివాస్ లకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ క్యాషియర్ నాంపల్లి వేణు గోపాల్, జెడ్ సి గడ్డం శంకర్ రెడ్డి, మహాజన్ నర్సింలు, వెల్మల శ్రీనివాసరావు, చెర్లపల్లి అరుణ్ దీప్ గౌడ్, ఇల్లెందుల వెంకటేశ్వర్లు, ముక్క మృత్యుంజయం పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు రాఖీ కట్టిన సీతక్క

**సూర్య వేములవాడ:**



రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని హైదరాబాదులో మంత్రి సీతక్క ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కి రాఖీ కట్టారు. అనంతరం తెలంగాణ ప్రజలకు వారు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా రాఖీ పండగ వేడుకలు

**సూర్య జగిత్యాల**





జగిత్యాల జిల్లాలో రాఖీ పండగ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. నీవు నాకు రక్ష నేను నీకు రక్ష అంటూ తమ సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. తమ శ్రేయస్సును ఆకాంక్షిస్తూ దూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలను ఓర్చుకుని వచ్చి రాఖీలు కట్టిన సోదరీ మణులకు సోదరులు కానుకలు సమర్పించారు. కాగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, నియోజకవర్గ ఇంచార్జి బొగ శ్రావణి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ కు రాఖీ కట్టారు. మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత సురేష్ మాజీ మంత్రి కే టి ఆర్ కు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు.

## ఘనంగా రక్షా బంధన్ వేడుకలు

**సూర్య రుద్రంగి**

రుద్రంగి మండలంలో గురువారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. అక్కాచెల్లెలు అన్నదమ్ములకు రాఖీలు కట్టి తమ ప్రేమను చాటుకున్నారు. రాఖీలు కట్టిన అక్కాచెల్లెలకు సోదరులు కట్నకానుకలు బహుకరించారు. రక్షా బంధన్ సందర్భంగా మండలంలోని బస్టాండ్ వద్ద రాఖీ దుకాణాలు, బస్సులలో రద్దీ పెరగడంతో పండగ వాతవరణం నెలకొంది. మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్యకు తన సోదరీమణులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ప్రజాప్రతినిధులు, నాయకులు మండల ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## శీ సీతారామ ఆంజనేయ దేవాలయంలో పూజలు

### -పద్మశాలి సమాజ సేవ సంఘం ఆధ్వర్యంలో..

**సూర్య బోయినపల్లి**

బోయినపల్లి మండలం కొత్తపేటలో జంద్యాల పూర్ణిమా పురస్కరించుకొని సోమవారం పద్మశాలిసమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ సీతా రామ ఆంజనేయ దేవాలయం లో పూజలు ఘనంగా నిర్వహించారు. సామూహికంగా పద్మశాలి కులస్తులు జంధ్యాలు వేసుకున్నారు అనంతరం అన్నప్రసాధం దేవాలయ ఆవరణలో పంపిణీ చేశారు .ఇట్టి కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు మాజీ ఏఎంసి డైరెక్టర్ చిందం వేణు గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షులు ద్యావనపల్లి శ్రీహరీ తో పాటు సహచర కార్యవర్గ సభ్యులు ఆలయ కమిటీ చైర్మన్ గుందేకార్ల రమేశ్ ,ఆలయ కమిటి కార్యవర్గ సభ్యులు పద్మశాలి కులభాందవులు పాల్గొన్నారు.

## ఆధార్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోండి

**సూర్య సిరిసిల్ల టౌన్**

సిరిసిల్ల పట్టణంలోని స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద బిఎస్ఎన్ఎల్ టెలికాం సంస్థ వారి ఆధ్వర్యంలో నూతన శాశ్వత ఆధార్ సెంటర్ ను బిఎస్ఎన్ఎల్ డీజీఎం పొన్నం అజయ్ ప్రారంభించినారు.ఈ సందర్భంగా డిజిఎం మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్ సేవలను ప్రజలందరూ సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ డిఈ దొర వెంకటేశ్వర్లు,ఎస్డిఈ ఎం.జనార్ధన్, తిరుమల్,జెటిఓ నరేష్,జేఈఈ వేంకటేశ్వర్లు, సిబ్బంది, బిఎస్ఎన్ఎల్ డీలర్ కూస రామచంద్రం,ముష్ణం విజయ్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి రాఖీ కట్టిన సోదరి లీలా

**సూర్య వేములవాడ**

రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడ శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ కు వారి స్వగృహంలో తన సోదరి లీలా రాఖీ కట్టి స్వీట్స్ తినిపించారు. అన్న చెల్లెళ్ళ అనుబంధం, ఆత్మీయ అనురాగలకు మారు పేరు రాఖీ పౌర్ణమి పండుగ అని ప్రభుత్వ విప్ అన్నారు. నియోజకవర్గ సోదర సోదరీమణులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

## జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య.

**సూర్య జమ్మికుంట**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటకు చెందిన సముద్రాల రమేష్ (30) అనే యువకుడు ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆబాది జమ్మికుంటకు చెందిన రజితను మొగుళ్లపల్లి మండలం పాత ఇసిపేట గ్రామానికి చెందిన సముద్రాల రమేష్ కు 7 సంవత్సరాల క్రితం ఇచ్చి వివాహం చేయగా వారికి ఒక బాబు ఒక పాప ఉన్నారు. మృతుడు రమేష్ బ్రతుకుతెరువు కొరకు అత్తవారి ఇల్లు అయినా ఆబాది జమ్మికుంటలో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని జీవిస్తున్నాడు. గత వారం రోజులుగా అధికంగా మద్యం సేవించి భార్యను చిత్రహింసలు పెట్టగా అది భరించలేని రజిత గ్రామంలోని తన తల్లివారింటికి వెళ్లిపోయింది మద్యానికి బానిసైన రమేష్ జీవిత పై విరక్తి చెంది అధివారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు

## నేడు మండలంలో పర్యటించనున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**సూర్య బోయినపల్లి**

బోయినపల్లి మండలంలో మంగళవారం పర్యటిం చనున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. ఉదయం 10:30 నిమిషాలకు తడగొండలో స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంత రం చేన్నాడి రవీందర్ రావు స్మారకర్థం స్తంభంపల్లి గ్రామ హైస్కూల్లో విద్యార్థులకు బెంచిల బహుకరణ కార్యక్రమం కు హాజం వుతారు.బోయినపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి మీడియాకు తెలిపారు.

### నిర్ణీత గడువులోగా ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి...

## జిల్లా కలెక్టర్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సూర్య సిరిసిల్ల టౌన్**

నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరి ంచాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాల యాల సముదాయ ంములో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.వివిధ శాఖల నుండి 9 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టవద్దని అధికారులను ఆదేశించారు.

## రాజన్న దర్శించుకున్న జిల్లా కలెక్టర్

**సూర్య వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా కుటుంబ సమేతంగా దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఆలయ ప్రోటో కాల్ పర్యవేక్షకులు రాజన్ బాబు కలెక్టర్ కుటుంబానికి శేషవస్త్రం, లడ్డు ప్రసాదం అందించారు.

## పలు ఆలయాల్లో పూజలు నిర్వహించిన మాజీ సర్పంచ్

**సూర్య బోయిన్పల్లి**

బోయినపల్లి మండలం తడగొండ గ్రామ మాజీ సర్పంచ్ చిందాం రమేష్ సోమవారం తన పుట్టినరోజును పురస్కరించుకుని గ్రామంలోని హనుమాన్, శ్రీ వేంకటేశ్వర స్వామి ,సాయిబాబా ఆలయాలు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంట ప్రజలు సుఖ సంతోషాలతో విరజిల్లాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి హనుమాన్ దేవాలయంలో హెూమం నిర్వహించిన భక్తులు

**సూర్య కొత్తపల్లి**

కొత్తపల్లి పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో హనుమాన్ భక్త కమిటీ ఆధ్వర్యంలో హెూమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు పట్టణంలోని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఘనంగా అనేక కార్యక్రమాలు ఆలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**సూర్య చొప్పదండి**

చొప్పదండి పట్టణంలో మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినో త్సవ వేడుకలను ఘనంగా నిర్వహి ంచారు .పట్టణంలో నిర్వహించిన వేడుకలకు అసోసియేషన్ సభ్యులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫ ర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడిగె అజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు నాంపల్లి నరేష్, కోశాధికారి సామల కిషోర్, ప్రచార కార్యదర్శి పెద్దెల్లి శ్యామ్, సభ్యు లు సిరిపురం శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, అనుమాండ్ల మహేష్ ,సింహాచలం కన్నా, నెల్లి శేఖర్, చిర్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గుంతల మయమైన రోడ్లు నరక ప్రాయమైన ప్రయాణం

**-కొత్త రోడ్లు వేసేది ఎన్నడు ... -రోడ్ల అభివృద్ధికి చర్యలేవి... -బిజెపి మండలాధ్యక్షుడు బిరుదు గట్టయ్య**

**సూర్య ముత్తారం**



గుంతల మయమైన రోడ్లు నరక ప్రాయమైన ప్రయాణం. కొత్త రోడ్లు వేసేది ఎన్నడు.. రోడ్ల అభివృద్ధికి చర్యలేవి.. కనీసం మరమ్మత్తులకు నోర్చుకోని ప్రధాన రోడ్లు అంటూ ఆవేదన వ్యక్తం చేసిన ముత్తారం మండల బిజెపి అధ్యక్షుడు బిరుదు గట్టయ్య. సోమవారం ముత్తారం ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంథని డివిజన్ పరిధిలోని రహదారులు పూర్తిగా గుంతల మయంగా మారి ప్రయాణికులకు నరకంగా మారాయని. ఎన్నికల ముందు రోడ్లు బాగులేవని విమర్శించిన మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల కాలం గడిచిన రోడ్లుకు మరమ్మతులు చేయించలేని నిస్సాహయక స్థితిలో ఉన్నారా!. విదేశీ పర్యటనలు చేస్తూ, హైదరాబాదులో ఉంటూ రాజకీయాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారే తప్ప రోడ్ల అభివృద్ధి గురించి చర్యలు తీసుకోవడం లేదని. మంత్రి హెూదాలో ఉన్నా ఆయన ఒక ఫోన్ కాల్ చేస్తే అధికారులు మరమ్మత్తులు చేస్తారు. ఫోన్ కాల్ చేసే తీరిక కూడా లేని అసమర్ధత మన మంథని ఓడేడు రహదారిని చూస్తే అర్థమవుతుందని అన్నారు. అధికారంలోకి రాక ముందు ఇసుక క్వారీలు లారీల గురించి అనర్గళంగా విమర్శించిన మంత్రి శ్రీధర్ బాబు గత ఎనిమిది నెలలుగా వాటి గురించి ఒకసారి కూడా మాట్లాడలేదు. కాంగ్రెస్ పార్టీ నేతలు క్వారీలన్నింటిలో వాటాదారులయినందున ఇప్పుడు మంత్రి మాట్లాడడం లేదు. ఇదేనా ప్రజాపాలన. ఇప్పటికైనా మంత్రి శ్రీధర్ బాబు రోడ్లను చూసి మంథని ఓడేడు రోడ్డును ఇరవై నాలుగు గంటల్లోగా మరమ్మత్తులు చేయించి తన సమర్థతను నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.



## పదిహేను క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్**

**సూర్య ముత్తారం**



ముత్తారం మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన పదిహేను క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. ఆదివారం అర్థరాత్రి సమయంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ మండల కేంద్రంలో ఎన్ఫోర్స్మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ముత్తారం మండల కేంద్రంలో గంట భీమయ్య అనే వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ ఉన్న పదిహేను క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తనిఖీల్లో పట్టుకోవడం జరిగిందన్నారు. గంట భీమయ్య పై పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ తనిఖీలో ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**సూర్య కమాన్ పూర్**



తోడపుట్టిన సోదరికి జీవితాంతం కష్ట సుఖాల్లో తోడుంటానని సోదరుడు ఇచ్చే అభయమే రక్షాబంధన్. తరాలు మారినా,యుగాలు గడిచినా వన్నె తరగనిది ఈ రాఖీ పండుగ. అలాంటి రాఖీ పౌర్ణమి వేడుకలు పెద్దపెల్లి జిల్లా కమాన్పూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి, ప్రేమాప్యాయతలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను మండల ప్రజలంతా సంతోషల మధ్య జరుపుకున్నారు. నాకు నువ్వు రక్ష నీకు నేను రక్ష మనమంతా ఈ దేశానికి రక్ష అంటూ రాఖీలు కట్టుకున్నారు. ఈ రాఖీ పండుగ అందరి బంధాల్లో కొత్త మాధుర్యాన్ని, జీవితంలో ఆనందం, శ్రేయస్సు తీసుకురావాలని పలువురు ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## రాఖీ కట్టండి..హెల్మెట్ ఇవ్వండి

**సూర్య జగిత్యాల**



రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాఖీ కట్టండి హెల్మెట్ బహుమతి గా ఇవ్వాలన్న జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ పిలుపు మేరకు అక్కా,చెల్లెల్లు తమ అన్నా తమ్ముళ్లకు రాఖీ కట్టి హెల్మెట్ బహుమతిగా ఇచ్చారు. ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ ఇలా చేస్తే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు,ఉపాధ్యక్షులు బొల్లం విజయ్,పి.సి.హన్మంత్ రెడ్డి, ఎం.డి.యాకూబ్, నాయకులు కే.సత్యనారాయణ,దిండిగాల విఠల్, బి.రాజేశ్వర్,దేవేందర్ రావు, నారాయణ, పబ్బా శివానందం,కండ్లే గంగాధర్,గంటేడి రాజ్ మోహన్, ఒజ్జల బుచ్చిరెడ్డి, జిల్లా, డివిజన్, మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

**సూర్య కమాన్ పూర్**

కమాన్పూర్లోని ఓ ఫోటోస్టూడియో ఆవరణలో ఫొటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా సృష్టి కర్త లూయిస్ డాకురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఫోటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు, పాల్గొన్నారు.



## అడ్రియాల గనిలో రక్షణను పరిశీలించిన సేఫ్టీ జీఎం

**సూర్య, సెంటినరీ కాలనీ 05 :**

నూతనంగా విధులలో చేరిన సేఫ్టీ జిఎం చింతల శ్రీనివాస్ సోమవారం అడ్రియాల గని లోకి దిగారు. గని లోపల రక్షణ చర్యలను పరిశీలించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. రక్షణకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనంతరం సేఫ్టీ జిఎం చింతల శ్రీనివాస్ ను ఏపిఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈయన వెంట రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం కే.హెచ్.ఎన్.గుప్తా, ప్రాజెక్ట్ ఆఫీసర్ కొలిపాక నాగేశ్వర్ రావు, ఎస్ఓఎం కోడేం జనార్దన్, ప్రాజెక్ట్ ఇంజనీర్ తూము రఘురాం, సేఫ్టీ ఆఫీసర్ మాచర్ల రమేష్, వెంటిలేషన్ ఆఫీసర్ కటకం కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్పూర్ గ్రామం పిల్లి పల్లెలో పేద కుటుంబానికి చెందిన కుందారపు పోశాలు(80) ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిన బోనాల వెంకటస్వామి, సుందరం ఫౌండేషన్ ప్రెసిడెంట్ బోనాల మల్లయ్య ఆదేశాల మేరకు తమ ఫౌండేషన్ సభ్యులతో కలిసి 25 కేజీల బియ్యం తో పాటు ఆర్థిక సహాయం వారి కుటుంబానికి అందజేసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ జంగపల్లి లక్ష్మణ్ , పిట్టల తిరుపతి, కురుమిళ్ల ప్రశాంత్, రెవెల్లి శివ, పిడుగు భీమలింగు, అరుణ్, సంతోష్, అంజి, రాజు, అరవింద్, ప్రశాంత్ మరియు వారి కుటుంబ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం

**సూర్య కమాన్ పూర్**



కమాన్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం ఇందిరా ఆధ్వర్యంలో వైద్య శిబిరానికి నిర్వహించారు. ఇందులో 42 మందికి సామాన్య వైద్యపరీక్షలు నిర్వహించగా 14 మందికి జ్వర బాధితులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఆర్డిటి కిట్, డెంగ్యూ జ్వరాల పరీక్షలు నిర్వహించగా ఈ పరీక్షల్లో ఎటువంటి విషజ్వరాలు లేనట్టు నిర్ధారణ అయింది. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## విద్యుత్ సిబ్బంది కష్టాలు

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



పండగ పూట ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యులతో వేడుకలు జరుపుకుంటున్న విద్యుత్ సిబ్బంది మాత్రం ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటూ కరెంటు కష్టాలు లేకుండా చూస్తున్నారు. సోమవారం పెద్దపల్లి లో ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పట్టణంలోని తెనుగువాడ స్మశాన వాటిక దగ్గరిలోని ట్రాన్స్ఫార్మర్ లో సాంకేతిక సమస్య రావడం తో భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వెంటనే పెద్దపల్లి టౌన్ 2 శాంతినగర్ సిబ్బంది అప్రమత్తమై లోపాన్ని సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ సిబ్బంది మాట్లాడుతూ పండగ పూట ప్రజలకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడటమే కర్తవ్యంగా పని చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బంది ని పలువురు అభినందించారు.

## ఘనంగా భక్త మార్కండేయ రథోత్సవం.

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో పద్మశాలి కుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం భక్త మార్కండేయ రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్త మార్కండేయ దేవాలయం నుంచి వీధుల గుండా మార్కండేయ స్వామి ఉత్సవ విగ్రహం తో ర్యాలీ నిర్వహించారు. మార్కండేయ రథోత్సవంతోపాటు మగ్గంతో ర్యాలీలోనే పంచ తయారు చేసి అనంతరం ఆ కొత్త పంచతో మార్కండేయనికి అలంకరించారు. అనంతరం నూలు పౌర్ణమి సందర్భంగా పద్మశాలి కులస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించే జంధ్యాలను ధరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు సబ్బని రాజ్యమల్లు, ఆడెపు రాజు, ఓడ్నాల శ్రీనివాస్, గోలి సుధాకర్, కాసర్ల శ్రీనివాస్, పాసిగంటి రవి, ఓడ్నాల రాజయ్య, చేరాల శంకర్, ఓడ్నాల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూక్య రామ్ రెడ్డి నాయక్‌కు వెలిచాల అభినందనలు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

గిరిజన ముద్దుబిడ్డ ఒక చిన్న మారుమూల గ్రామంలో జన్మించి పోలీస్‌శాఖలో అనేక ఏళ్లుగా సేవలందిస్తూ ఐపీఎస్‌గా పదోన్నతి పదవి పొందడం అభినందనీయమని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. సోమవారం భూక్య రామ్ రెడ్డి నాయక్ వెలిచాల రాజేందర్ రావుని వారి స్వగృహం లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఐపీఎస్‌గా పదోన్నతి పొందడం పై వెలిచాల రాజేందర్ రావు భూక్య రామ్ రెడ్డి నాయక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.